వేదాంతభేరి

మే 2021

రూ. 10/-

వేదాంతభేరి

మే 2021 రూ. 10/-



అమృతానుభవము

మూలం - సంత్ శ్రీజ్ఞానేశ్వర్

అనువాదం - నైనారు. అప్పాస్వామి

తే.గీ॥ విశ్వకారణ మూలమై వెలయుచుండు
ఆ నిరాకార శివ-శక్తి నాత్మదలచి
దేవ దేవేరు లిర్వురు తెలియవారు
మ్రొక్కి వేడితి వారల మొదమలర.

రెండు కలియగ నేకమై యుండునట్లు
వార లుందురా త్మానంద వాంఛ గలిగి
అట్టి యద్వైతమున కెట్టి యడ్డు లేక
వేరు వేరుగ నుండెడి విధము దోచు.

ఏక పూర్ణత్వముల కెట్టి ఎడము లేక
ప్రేమ రాగంబు లలర వేర్వేరు గాగ
ఒక్క ఆధారమందున ఒనరి యుండు
దేవ-దేవేరి వారల తేజ మొకటి.

విశ్వమును తమ శిశువుగ వింత గొలుప
సృష్టి సల్పిరి కాని యాసృష్టి వలన
వారి దివ్యాను రాగంబు పరమ మగుచు
ఎట్టి యెడబాటు నెరుగక పట్టియుండు.

దివ్యమౌ ప్రేమ భాసిల్ల తేజమలర
శివుడు శక్తియు నేకమై స్థిరముగాను
ద్వైత భావంబు లేక నద్వైత మగును
వేడ్కకైవారు దోచెద ర్వేరు గాగ.

భువిని సృష్టింప కారణ భూతులయ్యు
వేరుగాలేదు వారికి విశ్వమెల్ల
ఏకమైయుండి వెలుగుచు నేక కాంతి
ప్రకృతి - పురుషులైరి సంబంధ మలర.

వార లొక్కటే యనుట సప్పంబు గాదు
వార లిర్వుర నుటయు నవజ్ఞ యగును
వారి సత్యస్వ రూపంబెవ్వారి కైన
తెలియ రాకున్న దిదియని స్థిరముగాను.

ద్వైత మందున మోదంబు దెలియగోరి
ప్రకృతి-పురుష కల్పన పరగ జేసి
ఏలి నల్పితి నిదియని ఎరుక గలుగ
దైవ మించుక మది పరితాప మందె.

ఓం వేదాంతభేరి ఓం

సంస్థాపకులు : శ్రీశ్రీశ్రీ విద్యాప్రకాశానందగిరి స్వాములవారు

సంపుటము : 54 మే 2021 సంచిక : 05

సంపాదకులు
శ్రీ విద్యాస్వరూపానందగిరి స్వాములవారు
సంపాదక మండలి
శ్రీ సంపూర్ణానందగిరి స్వాములవారు
శ్రీవిజయానంద బ్రహ్మచారి
కె.ఈశ్వర్
డాక్టర్ సముద్రాల లక్ష్మణయ్య,శిరోమణి, ఎం.ఎ.,
డాక్టర్ కె.సర్వోత్తమరావు,ఎం.ఎ., పి.హెచ్.డి.,

శాశ్వత పోషక చందా రూ. 2000/- అంతకుమించి

సంవత్సర చందా రూ. 100/-లు , విడి సంచిక రూ. 10/-లు
విదేశాలకు సంవత్సర చందా (ఎయిర్ మెయిలు) 20 డాలర్లు

చందా పంపవలసిన అడ్రసు :
శ్రీ శుకబ్రహ్మాశ్రమము,
స్వామి విద్యాప్రకాశానంద నగర్,
శ్రీ శుకబ్రహ్మాశ్రమము (పోస్టు)
శ్రీకాళహస్తి, పిన్ - 517640
ఫోన్ : 08578- 222239

చందాదారులు ఉత్తర ప్రత్యుత్తరాలలో తమ చందా నెంబరు తప్పక వ్రాయవలెను.

Printed & Published by Sri Vidyaswarupanandagiri swami on behalf of Sri Sukabrahma Ashramam and Printed by B.Viswanadham at C.N. Printer, TIRUPATI, Andhra Pradesh; Published at Sri Sukabramhasramam, Swami Vidyaprakashananda Nagar, Sri Sukabramhasramam Post, Srikalahasti-517 640, Chittoor Dist., Andhra Pradesh.
Editor : SRI VIDYASWARUPANANDA GIRI SWAMI

ॐ వేదాంతభేరి ॐ

అనుష్ఠాన వేదాన్తాన్ని బోధించు మాసపత్రిక

సంపుటము : 54 మే 2021 సంచిక : 05

విషయ సూచిక

01. ప్రార్థన - 05
02. దారి బత్తెము -శ్రీవిద్యాప్రకాశానందగిరిస్వాములవారు - 06
03. మహాత్ముల ప్రబోధము - శ్రీరామకృష్ణ పరమహంస - 09
04. బుద్ధుని ధర్మపథము - 10
05. ధ్యానము - శ్రీసద్గురు మలయాళస్వాములవారు - 11
06. శ్రీ శంకరులు - డా ॥ సముద్రాల లక్ష్మణయ్య - 13
06. సాధన పంచకము - శ్రీ సంపూర్ణానందగిరి స్వాములవారు - 15
07. చిత్తశుద్ధి - శ్రీ సర్వాత్మానందగిరిస్వాములవారు - 19
08. శ్వేతాశ్వతరోపనిషత్తు -ఆచార్య శంకరానందగిరి స్వాములవారు-24
09. మంగళం - జయ మంగళం - ఆచార్య కె. సర్వోత్తమరావు- 28
10. జగత్సాక్షి - శ్రీ విద్యాప్రకాశానందగిరి స్వాములవారు - 34
11. ఆదర్శ గురువు - వేదాచార్య -డా॥ మట్టి కృష్ణారెడ్డి - 35
12. శ్రీమదాంధ్ర భాగవతం - తృతీయ స్కందం
- ఆచార్య డా॥ జక్కంపూడి మునిరత్నం - 38
13. హరి పాఠము - శ్రీ జ్ఞానేశ్వర్ మహరాజు - 41
14. వార్తలు - 42

ముఖచిత్రం - శ్రీ లక్ష్మి నరసింహస్వామి

14-05-2021 బసవేశ్వర జయన్తి,
14-05-2021 పరశురామ జయన్తి
16-05-2021 శ్రీ శంకరాచార్య జయన్తి
25-05-2021 నారసింహ జయన్తి, బుద్ధ జయన్తి

ఇందులోని వ్యాసముల భావములకు వ్యాస రచయితలే బాధ్యులు

ప్రార్థన

లక్ష్మీపతే కమలనాభ సురేశ విష్ణో
యజ్ఞేశ యజ్ఞ మధుసూదన విశ్వరూప
బ్రహ్మణ్య కేశవ జనార్దన వాసుదేవ
లక్ష్మీనృసింహ మమ దేహి కరావలంబమ్ ॥
ఏకేనచక్రమపరేణ కరేణ శంఖం
అన్యేన సింధుతనయా మవలంబ్యతిష్ఠన్
వామేతరేణ వరదాభయపద్మచిహ్నాం
లక్ష్మీనృసింహ మమ దేహి కరావలంబమ్ ॥
అంధస్య మే హృతవికేకమహాధనస్య
చోరైర్మహాబలిభి రింద్రియనామధేయైః
మోహాంధకారకుహరే వినిపాతితస్య
లక్ష్మీనృసింహ మమ దేహి కరావలంబమ్ ॥
లక్ష్మీనృసింహ చరణాబ్జమధువ్రతేన
స్తోత్రం కృతం శుభకరం భువి శంకరేణ
యేతత్పఠన్తి మనుజా హరిభక్తియుక్తాః
తే యాన్తి తత్పదసరోజమఖండరూపమ్ ॥

తా ॥ ఓ లక్ష్మీపతీ ! కమలనాభ! సురేశ! విష్ణో! యజ్ఞేశ! మధుసూదన! జనార్దన! వాసుదేవ! లక్ష్మీనృసింహస్వామి! సంసారాన్ని దాటడానికి నాకు నీ చేతిని ఆలంబనగా ఇమ్ము.

మహాబలశాలురైన ఇంద్రియములనే దొంగలచే దొంగలించబడిన వివేకమనే ధనంగల మోహాంధకార కూపం (బావి)లో పడిపోయిన గ్రుడ్డివాడినగు నాకు దాని నుండి బయడపడుటకు ఒక చేతిలో చక్రాన్ని, మరో చేతిలో శంఖాన్ని, ఇంకో చేతిలో లక్ష్మీదేవిని, మరో చేతిలో వరద అభయ చిహ్నమగు పద్మచిహ్నాన్ని ధరించి (పట్టుకొని) యుంటున్న వాడును, ప్రహ్లాద నారదాది భాగవతుల హృదయ నివాసియగు లక్ష్మీనృసింహా! సంసారాన్ని దాటుటకు నాకు నీ చేతిని ఆలంబనగా ఇమ్ము. (శ్రీ శంకరాచార్య కృత కరావలంబన స్తోత్రం నుండి)

దారి బత్తెము

– శ్రీ విద్యాప్రకాశానందగిరి స్వాములవారు

జీవితములోని ఎక్కువ భాగమును ఇరువురు అపహరించుచున్నారు. వారే ఆహారము, నిద్ర. ఆ రెండింటిని వశము (Control) నందుంచుకొనినచో దైవ ధ్యానమునకు ఎంతయో సమయము మిగులుచుండును. ఆహార సేవనమందు, నిద్ర యందు పరిమితిని అవలంబించినచో జీవుడు తరించుటకై ప్రయత్నము చేయుటకు బోలెడు సమయము లభించుచుండును. జీవితములో ప్రధానమైనవి పుణ్య సంపాదనము, దైవ చింతన. వానిని విస్మరించి జనులు నశ్వరములగు ప్రాపంచిక విషయముల కొఱకే పరుగిడుచున్నారు.

కాబట్టి జీవునకు శాశ్వతముగ ఉపకరించు పుణ్యము, భగవద్భక్తి, ఆత్మవిచారణ మున్నగువానికొఱకై సమయమును ఎంత మిగుల్చుకొనిన అంత మంచిది.

పుణ్యము దారిబత్తెమువంటిది. దారిబత్తెమును ముందుగనే జాగ్రత్త పఱచుకొను వాని ప్రయాణము ఏ విధమైన ఒడిదుడుకులు లేక సవ్యముగా జరిగిపోవునట్లు పుణ్యము నార్జించువానికి ఎల్లెడల సద్గతులే కలుగుచుండును.

కావున ఎంతయో శ్రేయమును కలుగచేయు పుణ్య సంపాదన విషయమై జీవుడు కడుజాగరూకుడైయుండి, సమయమును నిద్రాహారాదులందు వృథాగా గడిపివేయక క్రమశిక్షణతో వానిని అదుపునందుంచుకొని, అవసరమైనంతమాత్రమే తినుచు, అవసరమైనంత కాలమే నిదురించుచు,

మిగతా సమయమును తన శ్రేయోభివృద్ధికే వినియోగించుచుండవలెను. లేనిచో అమూల్యమైన మానవ జీవితము వ్యర్థమైపోవును.

మితాహారము వలన దైవధ్యానమునకు సమయము ఎక్కువగా మిగులుటయే కాక, ఆరోగ్యమున్ను జనులకు చక్కబడగలదు. మితాహారము ఉపవాసముతో సమానమని పెద్దలు చెప్పుదురు. అధికాహారముచే శరీరమునకు తరచు రుగ్మత ఏర్పడుచుండును. ఒక ఫ్యాక్టరీ నిరంతరము పనిచేయుచుండినచో చెడిపోవును గదా! కనుకనే వారమునకు ఒకరోజు దానికి విశ్రాంతి ఇచ్చుచుందురు. అట్లే శరీరమునకున్ను పదునైదు రోజులకొకసారి ఉపవాసము ద్వారా విశ్రాంతి నొసంగుట ఉత్తమము. తక్కిన దినములందును మితాహారమునే దేహమునకొసంగవలెనుగాని పొట్టను బరువెక్కునట్లు చేయరాదు. సాత్త్వికాహారముచేతను, మితాహారముచేతను, శరీరమేకాక, మనస్సున్ను ఆరోగ్యవంతముగా నుండునని శాస్త్రములు పేర్కొనుచున్నవి.

'ఆహార శుద్ధౌ సత్త్వశుద్ధిః, సత్త్వశుద్ధే ధ్రువా స్మృతిః, స్మృతిలాభే సర్వ గ్రంథీనాం విప్రమోక్షః' అని ఉపనిషత్తులు ఈ భావమునే స్పష్టీకరించుచున్నవి.

ఆహార శుద్ధిచే రక్తము శుద్ధమగును. రక్తశుద్ధిచే మెదడు శుద్ధమగును. దానిచే భావములు శుద్ధపడును. ధ్యానాదులున్ను చక్కగ జరుగును.

పదార్థములు బాగుగానున్నవని కొందఱు కక్కుర్తికి ఎక్కువగా తిని, జీర్ణించుకొనలేక, నానాయాతనలు పడుచుందురు. జిహ్వాచాపల్యమే వీనికి కారణము. పూర్వమొక రాజు జిహ్వేంద్రియమునకు పూర్తిగా వశుడై, ఎక్కువగా తిని, కక్కుకొని, మరల తినుచుండువాడట? జాగరూకత లేనిచో నాలుక జనులకు ముక్కుకు త్రాడుగట్టి పశువును వలె మార్చివేయుచుండును. కాబట్టి సంయమము చాల అవసరము.

ఒకచోట విందు జరుగుచుండెను. నాలుకపై అదుపుతప్పిన యొకడు దానిలో పాల్గొని, మితిమీరి తిని తుదకు నడవలేక తడబడు చుండగా మరియొకడు అతని శోచనీయ పరిస్థితిని గమనించి అతనికీ ప్రకారముగా హితబోధ గావించెను...

"నాయనా! ఒక బండిలోగాని, బస్సులోగాని ఎక్కువమందిని కూర్చొనబెట్టినచో, అది నిషేధము కావున వారిపై ఓవర్‌లోడ్ కేసు పెట్టి ప్రభుత్వము వారు శిక్షించుదురు గదా! అట్లే శరీరమునుగూడ అధికాహార సేవనముచే బరువెక్కించినచో విశ్వప్రభుత్వం వారు కూడ వారికి శిక్ష విధించుదురు. రోగమే ఆ శిక్ష. అశాంతియే ఆ శిక్ష. కాబట్టి ఇకమీదట యైనను జాగరూకుడవై శరీరమును బాధింపక నాలుకపై సంయమము కలిగి మితముగనే, హితముగనే భుజింపుము.." అని వాక్యములను విని తిండిపోతు క్షమాపణ వేడుకొని ఇకమీదట సక్రమముగవ్యవహరించెద ననియు, నాలుకకు లోబడకయుందుననియు పలికి వెడలిపోయెను.

కావున ముముక్షువులగువారు ఆహార విషయమై సంయమము గలిగియుండి, సాత్త్వికాహార, మితాహారములనే సేవించుచు, జిహ్వాచాపల్యమునకు లోనుగాక,, ఇంద్రియములను అదుపాజ్ఞలలో నుంచుకొని, సమయమును దైవధ్యాన, ఆత్మచింతనాదులందు గడుపుకొనుచు జీవితమును పునీతము గావించుకొనవలయును. పుణ్య సంపాదనకై వినియోగించవలెను.

వేదాన్తభేరికి ఈక్రింది వారు పోషక చందా పంపినారు

1. డి.జి.ఎస్. నారాయణ (హైద్రాబాద్) - రూ. 2000/-
2. కె. రాధారామకృష్ణారెడ్డి (ఐ.జి.క్వార్టర్స్) - రూ. 1500/- (రెండవ దఫా)

మహాత్ముల ప్రబోధము

- శ్రీ రామకృష్ణ పరమహంస

1. ఈ శరీరమందు 'అహం' అనునది ఏదియో చింతనజేయుము. విచారణ చేయుచు రాగా అహం పదార్థమనునది ఏదియు వుండదు. నీరుల్లి యొక్క పొరలను తొలగించుచు రాగా ఏమియు మిగులదు. జీవునియందు 'అహం' నశించిపోగా భగవంతుడు ఒక్కడే శేషించును.

2. పరమాత్మను దర్శించగోరిన ముముక్షువు నిత్యానిత్య వస్తు వివేకము కలిగి భగవన్నామమును శ్రద్ధతో స్మరించుచుండవలెను.

3. స్వేచ్ఛగ విహరించు ఏనుగు పంటలను, చెట్ల యొక్క కొమ్మలను నాశము చేయును. కాని అంకుశమును కలిగియున్న మావటీవాడు దానిని తన అదుపులో వుంచుకొనును. అటులనే అజ్ఞానులందు మనస్సు అనేక ప్రాపంచిక విషయములందు తిరుగాడుచు జీవునకు అశాంతిని కలిగించును.

కాని వివేకమను అంకుశమును సంపాదించినచో మనస్సు తన చంచల స్వభావమును వీడి శాంతముగ స్థితినొందియుండును.

4. ఏకాంత ప్రదేశమందు కూర్చుండి భగవన్నామమును స్మరించు చుండినచో-శబ్దమునకు చెట్టుపైనగల పక్షులన్నియు ఎగిరి పోవునట్లు- అతని మనస్సునందుగల దుస్సంస్కారములు క్షీణించిపోయి పరమశాంతి లభించును.

5. మలినముగ వున్న అద్దమందు వస్తువు యొక్క ప్రతిబింబము చక్కగ గోచరింపదు. నిర్మలమైన అద్దమందే ప్రతిబింబము స్పష్టముగా అగుపడును.. అదేరీతిగ మలిన మనస్సునందు, అజ్ఞాన మనస్సునందు దైవానుభూతి కలుగదు. నిర్మల మనస్సు నందే భగవదనుభూతి సంభవించును.

కనుక ముముక్షువు ఇంద్రియ నిగ్రహము, వైరాగ్యము, సత్సాంగత్యము, ధ్యానాదుల ద్వారా మనస్సును నిర్మలముగా ఒనర్చుకొని ఆత్మ సాక్షాత్కారమును బడసి పరమానందమును అనుభవించవలెను.

బుద్ధుని ధర్మపథము

బుద్ధుని, బుద్ధధర్మాన్ని, బుద్ధ సంఘాన్ని శరణుబొందువాడు. 1. దుఃఖము, 2. దుఃఖోత్పత్తి. (దుఃఖ కారణం). 3. దుఃఖ నివారణము, 4. దుఃఖ నాశోపాయము అను నాల్గు ఆర్య సత్యములను తన ప్రజ్ఞచే బాగుగా నెఱుగవలయును. ఇవి దుఃఖోపశమనమార్గమునకే గొనిపోవును. 1. సత్యధారణ, 2. సత్య సంకల్పము, 3. సత్య వచనము, 3. సత్కర్మ, 5. సత్య జీవిక, 6. సదుద్యోగము, 7. సత్యస్మృతి, 8. సమ్యగ్ధ్యానము అను ఆర్య అష్టాంగ మార్గమున్ను ఉత్తమ ఆశ్రయములు. వీటి నాశ్రయించిన మానవుడు సర్వ దుఃఖములనుండి విముక్తిని బడయును.

*　　*　　*　　*　　*

సమస్త ధర్మములందును మనస్సు వ్యాప్తమైయున్నది. ధర్మాచరణలో మనస్సే ప్రధాన స్థానాన్ని బడయుచున్నది. కర్మలన్ని మనోమయములే. ఎప్పుడైనను దోషంతో కూడిన మనస్సుతోకూడి మాట్లాడినా, కర్మలు చేసినా, రథాన్ని లాగే గుఱ్ఱము మొదలగు వాని పాదాలను రథచక్రమనుసరించునట్లు దుఃఖము వానిని వెంబడించును.

*　　*　　*　　*　　*

అన్ని ధర్మములందు మనస్సు వ్యాప్తమైయుంది. మనస్సే ధర్మాచరణలో ముఖ్య స్థానాన్ని పొందుతూంది. కర్మలన్నీ మనోమయాలు. ఎవడు నిర్మల చిత్తంతో గూడి మాట్లాడినా, కార్యాలను చేసినా, తనను ఎప్పుడూ వీడని నీడవలె సుఖము వానిని అనుసరించియుండును.

*　　*　　*　　*　　*

దృశ్య విషయాలందే ప్రీతిగలవాడు, ఇంద్రియ నిగ్రహం లేనివాడు, మితం తప్పి భుజించువాడు (తినువాడు), సోమరి, ప్రయత్న శూన్యుడు, శక్తిహీనుడగువానిని మారుడు -రాగద్వేషాది వృత్తులు దుర్బల వృక్షాన్ని గాలి (వాయువు) వలె పీడిస్తుంది. దృశ్య విషయాలపై ప్రీతి లేనివాడు, నిగ్రహింపబడిన ఇన్ద్రియాలు గలవాడు, మితంగా భుజించేవాడు, శ్రద్ధావంతుడు, కార్యశీలుడు అగువానిని గొప్ప పర్వతాన్ని వాయువు కదిలింపలేనట్లు మారుడేమీ చేయలేడు.

*　　*　　*　　*　　*

రాగద్వేషాది కషాయములను (చిత్తమాలిన్యాలను) విడిచిపెట్టక ఎవడు కాషాయ వస్త్రాలను ధరిస్తాడో, అతడు సత్యదమములకు దూరుడవుతాడు. అంతేకాదు, అట్టివాడు కాషాయ వస్త్రధారణకు అధికారి కాలేడు. **(బుద్ధ పౌర్ణమి సందర్భంగా)**

ధ్యానము

- శ్రీ సద్గురు మలయాళస్వాములవారు

మనకు ఫలమే కావలసియుండినను ఫలమునకు పుష్పము ఆధారముగను, పుష్పమునకు వృక్షము ఆధారముగను ఏలాగున నుండునో అదే రీతిగా జ్ఞానఫలమే కావలసి యుండినను అనుష్ఠానమను వృక్షము నుండియే భక్తి, ప్రశాంతమను పుష్పముద్భవించును. దాని అంతరాళము నుండియే జ్ఞానఫలము గలుగుచుండును. అనుష్ఠానవృక్షము శమదమాది పల్లవములు గల్గి సాధన చతుష్టయ సంపత్తి యనెడు పత్రములచేత నలరారుచుండును. కనుక వృక్షమును చక్కగా పోషించినచో పుష్పమున్ను, పుష్పము నుండి ఫలమున్ను గలిగి పండుపండి స్వయముగా క్రిందికి రాలుచున్నట్లు మంచి నిష్ఠగలవారికి నైష్ఠికసిద్ధి స్వయంగా గల్గును.

మిత్రులారా ! ఈ అనుష్ఠానము జ్ఞానపరమైయుండవలయును. కర్మపరమై యుండరాదు. కర్మఠులకు భేదమనెడు దుఃఖసాగరము నుండి దరిజేరుటకు మార్గము లేదు. కర్మము భయంకరమేగాని, భయరహితమగు ఆనందము గలుగజేయజాలదని తలచియే శ్రీశంకర, శ్రీరామానుజ, శ్రీబుద్ధ, శ్రీ ఏసుక్రీస్తు శ్రీ మహమ్మదు నిభి, శ్రీకృష్ణ చైతన్యాదులందరున్ను కర్మకాండ ప్రవృత్తిని చాలమట్టుకు తొలగించిరి. గనుకనే గీతయందు 'బహవో జ్ఞానతపసా, పూతా మద్భావమాగతాః" అని శ్రీకృష్ణ భగవంతుడు గానము చేసెను.

అనేకులు జ్ఞానమనెడు తపస్సుచేత పరిశుద్ధాత్ములై భగవద్భావమును బొందిరి. అయినను ఆత్మసోదరులారా! నీలిమందే కావలసినను నీలిచెట్టు నుండి గదా అది సిద్ధించును. అదే ప్రకారము పంచదారయే అవశ్యకమై యుండినను చెరుకునుండి గదా అది లభించును.

అలాగున సాధనయందుండియే సాధ్యము గల్గుచున్నదని మీరు మరువకూడదు. పైనుదహరించిన చెరుకు పాలు తీసిన తర్వాత పిప్పిని పారపోయునట్లున్ను, నీలిమందును ఎత్తుకొన్న తర్వాత పిప్పిని త్యజించు నట్లున్ను, అపరోక్ష స్థితి కల్గు పర్యంతము సాధన యుండియే తీరవలయును.

చెరుకు సకాలమున రసము తీయక పెంచినచో ముదిరిన తర్వాత కొంచెమైనను రసము లభింపక వట్టి బెండ్లైపోవునట్లున్ను, అదే రీతిగ సకాలమున నీలిచెట్టునుండి సారము గ్రహింపక చెట్టును పెంచిన కొంచెమైన, నీలిమందు దొరకక వట్టి కట్టెలైపోవునట్లు, కేవలము కర్మఠుల స్థితి దుఃఖమేయగును కనుక, మీరు కర్మఠులు గాకుండునట్లు చూడవలయును. అయినను జ్ఞానపరములగు కర్మలను త్యజింపరాదు. కర్మఠులకు కరుణ చాలా తక్కువయగును. భేదము వృద్ధియై యుండును గనుక ఆత్మశుద్ధియగు అంతరంగ సాధనమనుష్ఠింపుడు. ఇకమీద మనయొక్క చిత్తైకాగ్రత విషయమును గురించి విచారింపబూనెద.

చిత్తైకాగ్రత లేనిచో నిగూఢ రహస్యమేమియు మనకు గోచరింపదు. మీరేదైన యొక పదార్థము తినునపుడు, జిహ్వయందు చిత్తైకాగ్రత పరచిన మాత్రమే దానియొక్క రుచియు, వస్తువులయొక్క జ్ఞానమున్ను గల్గును.

అదేరీతిగా నేదైన యొక వాసన గనిపించిన వెంటనే అది ఏ వాసనయని తెలియుట, ప్రయాసముగానుండినను నాసికారంధ్రములో మనస్సును ఏకాగ్రత పరచిన ఆ వాసన యెచ్చట నుండి వచ్చుచున్న దనియు, పలాని వాసనయని తెలుసుకొనవచ్చును గదా !

అదేరీతిగా మన ప్రక్కనుండి యేదో యొక చిన్న శబ్దము వచ్చుచున్నదని గ్రహింపుడు. అయినను ఆ శబ్దము వ్యక్తముగా గోచరించుటకు, మనస్సును ఆ శబ్దము పైకి మరలించవలెను గదా. ఇదేరీతిగా అన్ని విషయములను విచారించిన చిత్తైకాగ్రత అత్యవసరమని గోచరింపక మానదు.

అద్వైత దర్శనం - శ్రీ శంకరులు

- డా ॥ సముద్రాల లక్ష్మణయ్య

'శంకరుడు' అన్న పదానికి "శం కరోతీతి శంకరః" అని వ్యుత్పత్తి ననుసరించి సుఖం కల్గించేవాడు అని అర్థం. త్రిమూర్తులలో శివునికి 'శంకరుడు' అను నామం సుప్రసిద్ధం.

ఆర్యాంబా శివగురువులకు పుత్రుడై జన్మించిన 'శంకరునికి' 'శంకరు'డన్న నామం కల్గడానికి రెండు కారణాలను పెద్దలు పేర్కొంటారు. ఒకటి త్రిమూర్తులలో ఒకడైన శంకరుని అనుగ్రహం వల్ల కల్గిన బిడ్డగాన 'శంకరుడు' అని ఆ బిడ్డకు తండ్రి నామకరణం చేశాడు. రెండు - తన్ను దర్శించిన వారికందరికీ అనిర్వచనీయమైన సుఖాన్ని ఆ బిడ్డ కల్గించాడు. ఆ కారణం వల్ల అతనికి 'శంకరుడు' అన్న వ్యవహార నామం సార్థకమయింది.

అసాధారణ ప్రజ్ఞాపాటవం కల్గిన శంకరుని విషయంలో ఈ క్రింది శ్లోకం సుప్రసిద్ధంగా ఉదాహరింపబడుతున్నది.

అష్టవర్షే చతుర్వేదీ ద్వాదశే సర్వశాస్త్రవిత్,
షోడశే కృతవాన్ భాష్యం ద్వాత్రింశే మునిరభ్యగాత్ ॥

దీని భావమిది- శంకరులు ఎనిమిదేండ్ల ప్రాయంలోనే నాలుగు వేదాలనూ అభ్యసించి అందులో నిష్ణాతులయ్యారు. పండ్రెండవ ఏట సర్వ శాస్త్రాలనూ ఆకళింపు జేసుకొని 'సకల శాస్త్రవేత్త'గా వినుతి కెక్కారు. పదునారవ యేట ప్రస్థాన త్రయానికి భాష్యాలు రచించారు. ముప్పది రెండవయేటనే తన అవతార కార్యం ముగించుకొని శరీర పరిత్యాగం కావించారు.

పైన పేర్కొన్న చర్యలు సామాన్య మానవులకు సాధ్యం కానివి. భగవదంశ సంభూతులు మాత్రమే అట్టి ఘనకార్యాలు సాధింపగలరు.

శ్రీ గోవింద యోగీంద్రులనువారు శంకరులకు తత్త్వోపదేశం చేశారు. అద్వైత మతమును ప్రపంచములో ప్రచారం చేయడమే తన జీవితలక్ష్యంగా భావించిన శంకరులు ఆ పనిని విజయవంతంగా పరిపూర్ణం కావించి కృతకృత్యులయ్యారు. బ్రహ్మ సత్యం జగన్మిథ్యా" అన్న సత్యాన్ని లోకానికి చాటారు.

జగద్గురువులుగా ప్రసిద్ధులైన శ్రీ శంకరులు భరతఖండమంతా సంచరించారు. లోకంలో వ్యాపించియుండిన కుమతాలను నిశితంగా ఖండించారు. పరమాద్వైత మతాన్ని స్థాపించారు. వారి శిష్యులు (1). పద్మపాదులు,

(2). హస్తామలకులు (3). తోటకులు (4). సురేశ్వరాచార్యులు అనువారు గురు నిర్దిష్ట మార్గాన్ని అనుసరించి అద్వైతతత్త్వాన్ని లోకానికి ప్రబోధించారు.

భారతీయమైన ఆధ్యాత్మిక శాస్త్రములలో అద్వైత వేదాంత దర్శనం అగ్రగణ్యమైనది. ఉపనిషత్తులే వేదాంతానికి మూలమైనవి. వేదము యొక్క చరమ సిద్ధాంతం అన్న అర్థంలో 'వేదాంత' శబ్దం వ్యవహారంలోకి వచ్చింది. ఉపనిషత్సిద్ధాంతాలలో ఆపాతతః కనిపించే వైరుధ్యాన్ని తొలగించడానికే వ్యాస భగవానుడు బ్రహ్మసూత్రాలను రచించాడు. ఉపనిషత్తత్త్వమే భగవద్గీతలో క్రోడీకరింపబడిందని -

సర్వోపనిషదోగావో దోగ్ధా గోపాలనందనః ।
పార్థోవత్సః సుధీర్భోక్తా దుగ్ధం గీతామృతం మహత్ ॥

అన్న సుప్రసిద్ధ శ్లోకం ప్రతిపాదిస్తున్నది. శంకరులు అద్వైతపరంగా ప్రస్థాన త్రయాన్ని వ్యాఖ్యానించిన తరువాత అనేకులు బ్రహ్మసూత్రాలకు భాష్యాలు వ్రాశారు. ఆ భాష్యాలలో 'శారీరక భాష్యం' –అన్న పేర వెలసిన శంకర భాష్యం మకుటాయమానమై రాణిస్తున్నది. అద్వైత వేదాంతంలోని అనేకాంశాలు నేటి భౌతిక విజ్ఞాన శాస్త్రంలోని అంశాలతో సమన్వయిస్తున్నవి. అందుచేతనే ఆధునిక శాస్త్రజ్ఞులు అద్వైత వేదాంతాన్ని మిక్కిలి ఆదరంతో చూస్తున్నారు.

'బ్రహ్మమొక్కటే పరబ్రహ్మమొక్కటే' (అన్నమయ్య పాట) మున్నగు లోక ప్రసిద్ధమైన సంకీర్తనలు అద్వైత వేదాంతతత్త్వాన్నే నిరూపిస్తున్నాయి. 'అభేద దర్శనం జ్ఞానం' అన్నట్లు ఎట్టి భేద దృష్టీ లేకుండా సర్వాన్నీ బ్రహ్మమయంగా చూడాలన్నదే అద్వైత వేదాంత సారాంశం.

భేద భావం అశాంతికి కారణమవుతుంది. అభేద దర్శనం శాంతికీ, సుఖానికీ కారణమవుతుంది. ఈ తత్త్వాన్ని శ్రీ శంకరాచార్యుల వారు అత్యద్భుతంగా నిరూపించారు.

'సమ బుద్ధే యిందరికీ సర్వవేదసారము' (అన్నమయ్య) అన్న తత్త్వాన్ని శంకరాద్వైతం నిస్సందేహంగా నిరూపించింది.

శ్రీ మలయాళ సద్గురు స్వాములవారు శ్రీ ధర్మసేతువు అన్న గ్రంథంలో 248వ పుట నుండి 254వ పుట వరకు 7 పుటలలో శ్రీశంకరాచార్యుల వారి జీవితాంశాలను, ఆధ్యాత్మిక తత్త్వ ప్రబోధాన్నీ గురించి వివరించి యున్నారు. శ్రీ మలయాళ సద్గురు గ్రంథావళి, 4వ సంపుటములో చూడవచ్చును.

సాధన పంచకము

- శ్రీ సంపూర్ణానందగిరి స్వాములవారు

(గత సంచిక తరువాయి)

నతువృథా వాక్యం సముచ్చార్యతామ్, నిష్కారణముగా మాటాడకుండవలెను.

మానవుడు అవసరం లేని వ్యర్థమైన మాటలు మాని, వ్యవహార సమయములో మాటలాడుట ప్రతివానికి తప్పదు. కాబట్టి, మితముగా అర్థవంతమైన మాటలు మాట్లాడవలెను. రఘువంశ మహారాజులు మాటలాడినపుడు ఎదుటివాడు చెప్పినది విని, కొంత సమయమాలోచించి, సార్థకమైన మాటతో సమాధానం చెప్పేవారు. అవసరము కంటే అధికముగా మాట్లాడేటప్పుడు అసత్యమైన పలుకులు వచ్చును. ఇతరులపై నిందా వాక్యములు, కఠోర వచనములు తన వశము లేకుండా వచ్చును. మీరు తప్పుడు మాటలన్నారు అని ఎదుటి వ్యక్తి అంటే నేను అనలేదు అంటారు. గీత–అ 17–శ్లో ॥15లో అనుద్వేగకరం వాక్యం సత్యం ప్రియహితంచయత్। స్వాధ్యాయాభ్యసనం చైవ వాఙ్మయం తప ఉచ్చతే"॥ మనము వాక్యముచ్చరించినపుడు నాల్గు విశేషణములతో గూడి యుండవలెనని, అపుడే వాక్యము వృథాకాదని సార్థకమగునని గీతాచార్యులు దెలిపిరి. అవి ఏవనగా– **1.** అనుద్వేగకరం వాక్యం = పరుల మనస్సును బాధ కలిగించనదిగా యుండవలెను. కఠినముగా మాటలాడి ఇతరులకు భయమును, దుఃఖమును గలిగించునదిగా మాటలాడరాదు. **2**. సత్యం= అబద్ధమాడరాదని భావము. 3. వినువారికి ప్రియముగా ననగా మనస్సునకు, చెవులకు ఆనందమును గలిగించునదిగా మృదువుగా నుండవలెను. **4**. హితము= మేలును గలిగించునదిగా నుండవలెను. అనగా పురుషార్థమును గలిగించునదిగా

యుండవలెను. నాలుగు విశేషములతో గూడిన వాక్యము తపస్సగును. వేద, గీతాది పారాయణలు, జపధ్యానము వలన మనస్సు సూక్ష్మమయి వాక్కు మృదువగును. ఈవిధముగా 30వ సాధనను శ్రీ ఆచార్యులవారు దెలియజేసిరి.

ఔదాసీన్య మభీప్స్యతామ్ । ఉదాసీన భావమే ఇష్టమైనదిగా నుండవలెను.

ఉదాసీనుడంటే = "రాగద్వేష శూన్యః, పక్షపాతరహితః" రాగద్వేషములు లేనివాడని, పక్షపాత రహితుడని ఈ విధముగా అర్థములు గలవు. తటస్థుడు, ఉపేక్షకుడు అని అర్థములు. రాగద్వేషములు లేనివాడే ఉదాసీనుడుగా యుండగలడు. రాగమున్న, ద్వేషమున్న ఆ భావాలకు లోనై చిత్తలోలుడుగానగును. లోకంలో స్తుతించే వారుంటారు. ద్వేషించే వారుంటారు. అవమానం చేసేవారుంటారు. సన్మానం చేసే వారుంటారు. ఇలాంటి పరిస్థితులలో డోలాయమానం కాకుండా సంతోష దుఃఖములకు లోనుగాకుండా ఉన్నవారిని ఉదాసీనులందురు. ఆత్మానాత్మ విచారణ పరులై పరమార్థమును విచారణ ద్వారా తెలుసుకొనేవారికి స్వభావముగా ఉదాసీన భావము సిద్ధించును. సామాన్యముగా లోకంలో కొంతమంది వారి మాట ఎవరూ విననపుడు, వారిని ఎవరూ పలకరించ నపుడు, ఏ విషయములో గూడ వారి మాట సాగనపుడు ఈ ఉదాసీన వృత్తి నవలంబించెదరు. నాకేమీ సంబంధము లేదు. మీ ఇష్టం వచ్చినట్లు చేసుకోండి అంటారు. ఆ సమయంలో ఇంట్లో వచ్చు లాభనష్టాలను పట్టించుకోరు. ఎపుడు నా మాట వింటారో, నా అధికారం ఎపుడు వస్తుందా అని రాగద్వేష వృత్తితో గూడిన ఉదాసీనమే గాని, స్వభావ సిద్ధమగు ఉదాసీనము కాదు. ఒకవిధంగా ఉదాసీనుడనగా స్థిత ప్రజ్ఞుడనే చెప్పుకోవాలి. గీత -అ 2-57లో "యస్సర్వత్రానభిస్నేహః తత్తత్ప్రాప్య శుభాశుభమ్ ।

నాభినందతి నద్వేష్టి తస్య ప్రజ్ఞా ప్రతిష్ఠితా ॥

ఎవడు సమస్త వ్యవహారములయందు, దైనందిన జీవితంలో సంభవించిన సర్వకార్యములయందును వాటివలన గలుగు శుభము అశుభముల పొంది, శుభ విషయంలో ఆనందింపడో, అశుభ విషయంలో ద్వేషింపడో అటువంటి వాని జ్ఞానము స్థిరమైనది. ఇటువంటి వానినే స్థిత ప్రజ్ఞుడన్నారు. ఇటువంటివాడే ఉదాసీనుడనబడును. శాంతి సుఖముల నొసగిన ఉదాసీన భావమందు సదా ఇష్టము గలిగియుండమని, మానవుడు తరించగలడని 31వ సాధనను శ్రీ ఆచార్యుల వారు బోధించిరి.

జనకృపా నైష్ఠుర్యముత్సృజ్యతామ్ ।

ప్రజల యొక్క స్తుతి నిందలను విడువబడవలెను. ఈ ప్రపంచములో నిందాస్తుతులు సర్వ సామాన్యము. "లోకోభిన్న రుచిః" అన్నారు. ఒకరు చేసే పని కొంతమందికి నచ్చుతుంది. కొంతమందికి నచ్చదు. నచ్చనివారు పరుషమైన మాటలాడెదరు. నచ్చినవారు పొగడెదరు. అందరకు నచ్చినట్లు పనులు చేయలేరు. కావున నిందాస్తుతుల యందు సమభావమును పొందినపుడే మానవునకు శాంతిగలుగును, సాధనాభివృద్ధి జరుగును. ప్రతివారు ఇతరులను నిందించరాదు, కఠినమైన వాక్కులు పలకరాదు అని భావించవలెను. నిందయనగా ఉన్న దోషములు గాని, లేని దోషములుగాని ఆ మనిషి ఎదుటనే ప్రకటించుట, లేదా ఇతరుల వద్ద ప్రకటించుట. "ఆస్యేన పరస్య విద్యమాన అవిద్యమాన దోష సంకీర్తనమ్" నిందా అని లక్షణమ్। "దోషావిష్కరణమ్ నిందా" అని గూడ అందురు. స్తుతియనగా -"గుణ నిష్ఠ గుణాభిధానమ్" "ఆరోప్య గుణ కథన మితిస్తుతిః" గుణోత్కర్ష ప్రతిపాదికా యాం వాచమితి"

మానవుడు ఆచరించునవి. శాస్త్ర విధానముగా, సత్యధర్మాలతో,

పరోపకార పరాయణతో, సత్కర్మాచరణతో ఉన్నవానిని చూచి, ఈ గుణగణములను కీర్తించుటను స్తుతి అందురు. ఒక పక్షమున అతడు తక్కువగా ఆచరించినను, ఎక్కువ వర్ణించెదరు కొందరు.

కొంతమందికి సదాచార గుణములు లేకపోయినను, వారి నుండి ధనాదులు పొందాలని ఆశతో వానిని నీవంటి మంచి గుణములు గలవాడు లేడని కీర్తించెదరు. స్తుతి చేయుదురని భావము. ఈ ప్రక్రియ మంచిది కాదు. మరియు మంచి గుణములు కలవాని యందు ఈర్ష్యా అసూయాదులతో చెడ్డ గుణములు ఆరోపించుట మంచిది కాదు. స్వయముగా ఎవరికి వారు తనలో లేని మహిమలను తనయందు గొప్ప మహిమలు ఉన్నాయని గూడ చెప్పుకోగూడదు. "లేని మహిమలు చెప్పుకొంటే, ఉన్నవి అనగా సంపాదించిన మహిమలు గూడా నష్టమగునని సద్గురు శ్రీ మలయాళస్వాములవారు చెప్పిరి.

నిందాస్తుతులు శరీరానికే గాని ఆత్మకు లేవు అని దృఢ భావన కలిగియుండవలెను. ప్రతిదినం భగవద్గీత తాత్పర్యము 1, లేక 2, శ్లోకములకు చదువవలెను. మన గురుదేవులైన పూజ్య శ్రీ విద్యాప్రకాశానందగిరి స్వాములవారు రచించిన గీతామకరందంలో తాత్పర్యము చదివి, మనము చేయుచుండిన, నిందాస్తుతులు నాకు లేవు. శరీరమునకేయని బోధగల్గును. వీటికి నేను సాక్షిని అనే విజ్ఞానముద యించి స్వాత్మజ్ఞానము గలుగును. ఈ విధముగా 32వ సాధనలో నిందా స్తుతులను విడచుట ఒక సాధనముగా శ్రీ ఆచార్యులవారు దెలియజేసిరి.

ధ్యానం చేసేటప్పుడు భగవంతుడు పురాణ కథలలోని కల్పవృక్షం వలె నీ ఎదుట నిలుచొని ఉన్నట్లు భావించాలి - స్వామి బ్రహ్మానంద

చిత్తశుద్ధి

- శ్రీ సర్వాత్మానందగిరి స్వాములవారు

పదార్థాలు గానీ, వస్తువులు గానీ వాటియొక్క నిర్ణీత ప్రయోజనాన్ని కలిగించే స్థితిలో వుండటమే వాటియొక్క శుద్ధి అనబడుతుంది. ఆ విధంగా అవి వున్నప్పుడే వాటి ఉపయోగము వలన మనుష్యులకు సుఖసంతోషాలు కలుగుతాయి. వాటి ప్రయోజనానికి భంగము కలిగించే ఇతర పదార్థాలతో కలిసినప్పుడు ఆయా వస్తువులు దోషయుక్తము, మలినము, అశుద్ధమైనవిగా అయి వాటిని ఉపయోగించిన వారికి నష్టాలు, కష్టాలు, బాధలు ఇత్యాదులను కలిగిస్తాయి. ఉదాహరణకు- మురికి చేరిన నీరు, విరిగి పోయిన పాలు, ఈగలు, పురుగులు కలిసిన ఆహార పదార్థాలు. మురికి పట్టిన వస్త్రాలు, చెదలు పట్టిన కర్ర వస్తువులు. మురికిగల పాత్రలు, మాలిన్యం చేరిన యంత్రాలు గల వాహనాలు, వ్యాధిగ్రస్తమైన శరీరము, మంత్ర తంత్ర స్వర వర్ణ లోపాలతో కూడిన కర్మలు ఇత్యాదులు ఎవరికీ గూడా సుఖసంతోషాలను కలిగించలేవు. ఈనాటి కంప్యూటర్‌లు, సెల్‌ఫోనులు కూడా వైరస్ చేరినవైతే ఆశించిన పనిని చెయ్యలేవు.

ఇక ఈ ప్రాపంచిక వస్తు పదార్థాలన్నీ ఎంత శుద్ధిగా వున్నా గూడా అవి మనిషికి తాత్కాలికమైన సంతోషాన్ని మాత్రమే కలిగిస్తాయని ప్రతివారి జీవితానుభవములో గమనించవచ్చును. ఎందువలన? - మనసు యొక్క చంచలత్వము, వస్తు పదార్థాల నశ్వరత్వము, శారీరక మార్పులు ఇత్యాదుల వల్ల అని తేలుతుంది.

ఈ ప్రాపంచిక సుఖానికన్నా భిన్నమైనదీ, ఉత్తమమైనదీ, సత్యమైనదీ, స్వతంత్రమైనదీ అంటే ఏ ఇతర వస్తువులు మీద ఆధారపడనటు

వంటిదీ, శాశ్వతమైనదీ ఐనటువంటి సుఖము మరొకటి ఆనందమనే పేరుతో వున్నదని అధ్యాత్మిక శాస్త్రాలు తెలుపుతున్నాయి. దాన్ని అనుభవించిన వారు గూడా చరిత్రలో నిలిచిపోయారు. ఆ ఆనందము మనిషికి తన నిజస్వరూప జ్ఞానము అంటే ఆత్మజ్ఞానము కలిగినప్పుడే అవగతమౌతుంది.

"జీవో బ్రహ్మైవ నా ఉ పరః " "తత్త్వమసి" ఇత్యాది స్మృతిశ్రుతి వాక్యాలు జీవుడు బ్రహ్మ స్వరూపుడే అంటే ఆత్మ స్వరూపుడే అని చెప్పినవి ఆస్తికుల కందరికీ తెలిసే వుంటాయి. మరైతే వారందరూ ఆత్మానందాన్ని ఎందుకు అనుభవించటం లేదు? దీనికి కారణము ఆ జ్ఞానము చిత్తములో వున్నా గూడా దానితోబాటు ప్రాపంచిక వాసనలు అనే మాలిన్యము కూడా కలిసి వున్నందున, అంటే చిత్తశుద్ధి లేనందున ఆత్మానందానుభవము కలగటము లేదు.

చిత్తము అంటే ఏమిటి? – మనిషి యొక్క వ్యవస్థ 24 తత్త్వాలతో కూడుకుని వున్నది. అవి కర్మేంద్రియాలు ఐదు, పంచ జ్ఞానేంద్రియాలు, పంచప్రాణాలు, పంచతన్మాత్రలు అంటే శబ్ద స్పర్శ రూప రసగంధాలు, మనసు, బుద్ధి, చిత్తము, అహంకారము అని నాలుగు విధాలుగా పనిచేస్తున్న అంతఃకరణము. రెండవది లింగశరీరము అని పేరుగల ఇది నిలిచివుండి తన కార్యకలాపము చేసుకొనడానికి నిర్మించుకున్నది. త్వక్కు మాంస రక్త అస్థి స్నాయుమేధ మజ్జ అనే సప్తధాతుమయ శరీరము. మూడవది వీటన్నిటినీ క్రియావంతము చేసే ప్రత్యగాత్మ చైతన్యము.

ఈ శరీర వ్యవస్థలో నేను అనే పేరు గల అహంకారము శరీరేంద్రియాల ద్వారా సుఖదుఃఖాత్మకమైన అనేకానుభవాలను పొందుతూ వాటి స్మృతులనూ, ఇంకా తన ఇష్టాయిష్టాలనూ, తత్సంబంధ కోరికలను

చిత్తములో భద్రపరుచుకుంటుంది. చిత్తమనేది ఒక నిలవస్థానము లేక స్టోర్ రూమ్ భద్రపరచు స్థలము అన్నమాట.

చిత్తము పరిమాణము (సైజు) అంటే సైజులో వెంట్రుక కొసలో శతాంశమైనా కూడా ("సేంద్రయోనిః యత్రాసౌ కేశాంతో వివర్తతే" తైత్తిరీయోపనిషత్తు) విషయానుభవాలను, విషయ జ్ఞానాన్నీ, ఇష్టాయిష్టాలనూ నిలవ చేసుకోవడానికి దానిలో చోటుకు ఒక పరిమితి అన్నది లేదు. బాగా తెలియాలంటే ఈనాటి మెమొరీ కార్డు వంటిది అని. శబ్ద స్పర్శరూపరస గంధాత్మకమైన వివరాలనెన్నిటినైనా అది నిలవ చేసుకో గలుగుతుంది. అంటే 'జి బి'లకు, 'టి బి'లకు పరిమితి లేనిది అని అర్థము. కాబట్టే మనిషి చిత్తంలో తన ఇదివరకటి లక్షల కోట్ల జన్మల అనుభవాలన్నీ భద్రంగా దాచబడి వుంటాయి. వీటికే వాసనలు అని పేరు.

వాసనా సహస్రాలలో పశ్వాది జన్మల అనుభవాలను ప్రక్కన వుంచినా గూడా మానవ జన్మల సంబంధమైన చతుర్వేద వేదాంగ, షట్శాస్త్ర కళ వృత్తి భూగోళ ఖగోళ –జ్ఞాన లౌకిక విద్యాత్మకమైన సకల వాసనలు గూడా చిత్తమాలిన్యం క్రిందే పరిగణించబడుతుంది. ఎందువలన అంటే ఇదంతా భేదజ్ఞానము, అంటే పరమాత్మేతర భావానికి సంబంధించినది. కాబట్టి జీవిని సుఖదుఃఖ తరంగ కల్లోలమయ సంసార సాగరాన్ని దాటించలేనిది కాబట్టీ, అంటే జనన మరణాలనుండి రక్షించ లేనిది అని భావము.

చిత్తశుద్ధి అంటే ఈ మాలిన్యమంతా తొలగిపోవటము. ఇంత అపార మాలిన్యము ఏవిధంగా తొలగిపోతుంది అనే భయవిచారాలు అవసరము లేదు. ఎంత పెద్ద అడవినైనా గూడా దావాగ్ని దాన్ని

భస్మీభూతము చెయ్యగలదు గదా! ఆ విధంగా చిత్తంలో గల ఆత్మజ్ఞానాగ్నిని బాగా రగులు కొలపడము వలననూ, లేదా బ్రహ్మజ్ఞానుల నుండి అటువంటి అగ్నిని సంపాదించటము వలననూ చిత్తమాలిన్య వనము నిస్సంశయంగా దగ్ధము కాగలదు.

ఆత్మజ్ఞానము ఏ విధంగా లభిస్తుంది?

తద్విద్ధి ప్రణిపాతేన పరిప్రశ్నేన సేవయా! ఉపదేక్ష్యంతితే జ్ఞానం జ్ఞానినః తత్త్వదర్శినః" అని శ్రీమద్భగవద్గీతలో భగవానుడు సెలవిచ్చారు. స్వరూపానుభూతిలో వున్న జ్ఞానులకు సాష్టాంగ ప్రణామము చేసి ముముక్షతో వినయ పూర్వకంగా వారిని సేవించి వారి ప్రసన్నతను పొందిన వారికి ఆ మహానుభావులు ఆత్మతత్త్వజ్ఞానాన్ని ఉపదేశిస్తారు అని శ్లోకార్థము.

మరి అటువంటి బ్రహ్మస్వరూపులు ఏవిధంగా లభించగలరు? –నిష్కామ సత్కర్మాచరణము చేత ఆ సత్పురుషుల సాంగత్యము లభించగలదు. నిష్కామ సత్కర్మ అంటే ఏమిటి? – ఫలాన్ని ఆశించకుండా చేసే సత్కర్మ అని అర్థము. ఫలాన్ని ఆశించకపోతే సత్కర్మను చెయ్యడము దేనికోసము? – ఫలాన్ని ఆశించకపోవటము అంటే చేసిన కర్మ ద్వారా ఫలాన్ని పొంది ఈ లోకంలో గానీ, పరలోకంలో గాని శాశ్వతంగా, సుఖంగా వుందామనే ఆశను వదలిపెట్టి, కేవలము పరమాత్మ నా కర్మ చేత సంతోషించాలి అనే భావనతో కర్మను చెయ్యడము అని అర్థము.

సత్కర్మ అంటే –చేసే ప్రతి కర్మలో అభిమానాన్ని వదిలిపెట్టడము. దంభాన్ని దూరంగా వుంచడము, ప్రాణులమీద ప్రేమభావన చెయ్యడము, ఇతరుల వలన కలిగిన కష్టనష్టాలను ప్రతీకార భావన లేకుండా ఓర్చుకొనడము, కపటము లేకుండా పెద్దలను ఆదరంతో సేవించడము,

బాహ్యశౌచ అంతఃశౌచాలను పాటించడము, ధ్యానజప సంకీర్తనాదులను స్థిరంగా కూర్చుని ఏకాగ్రంగా చెయ్యడము, మనసును అనవసరము. సంబంధము లేని లౌకిక విషయాల వైపుకు వెళ్ళనివ్వకుండటము, పరుల కార్యకలాపాలను గురించి విమర్శించకబోవడము, విషయ భోగాలమీద వైరాగ్యము కలిగి వుండటము, కుటుంబ పోషణలోనే మునిగి పోకుండటము, నవవిధ భక్తులతో వేటితోనైనా పరమాత్మను సేవించడము, భగవంతుడు, భాగవతుల కథలు గుణగణాలను వినటము, చదవటము ఇత్యాదులన్నీ సత్కర్మలే.

సత్కర్మలు, శాస్త్రాలు, సద్గురువుల బోధలు ఇత్యాదులన్నింటి ఉద్దేశ్యము చిత్తంలోని బ్రహ్మేతర వాసనా పటలము భస్మము కావడము మాత్రమే. అది సంపన్నమైన తరువాత ఇక చిత్తము అహంకారాది త్రిగుణాత్మక నామరూప విషయాలన్నీ లయించిపోయి సర్వానుస్యూతంగా గల ఆత్మచైతన్యావగతి ఒక్కటే మిగిలిపోతుంది. ఖనిజ బంగారము నుండి సకల వ్యర్థ పదార్థాలను పూర్తిగా తొలగించి వేస్తే మేలిమి బంగారము మాత్రమే మిగిలినట్లు అని భావము.

"యతేంద్రియ మనోబుద్ధిః మునిర్మోక్ష పరాయణః ।

విగతేచ్ఛాభయక్రోధో య స్సదా ముక్త ఎవ సః"॥ అన్న భగవద్గీతా శ్లోకము ఆ బ్రహ్మనిర్వాణ స్థితినే సూచిస్తున్నది. అదే మన సహజస్థితి. ఆ స్థితికోసము ప్రయత్నించెదము గాక. **ఓం తత్ సత్**

26-04-2021వ తేది గురుదేవుల 23వ ఆరాధన సందర్భంగా శ్రీవారిమూర్తికి అభిషేకార్చనలు జరుగును. 29-04-2021వ తేది గురువారం శ్రీవారి 108వ జన్మదిన సందర్భంగా 108 శంఖాలతో అభిషేకం చేయబడును.

శ్వేతాశ్వతరోపనిషత్తు

శ్రీ శంకర భగవత్పాదులవారి సంబంధ భాష్యానువాదము

అనువాదకులు - ఆచార్య శంకరానందగిరి స్వాములవారు, (పెనమలూరు)

(గత సంచిక తరువాయి)

అనువాదం : శివధర్మోత్తరంలో గూడ చెప్పబడిందేమంటే 'జ్ఞానామృతంతో తృప్తులై కృతకృత్యులైనవారికి ఏ కర్తవ్యకర్మ వుండదు. ఒకవేళ వుందంటే అతను తత్త్వవేత్త కాదు. తత్త్వవేత్తకు ఇహపర లోకాల్లో కర్తవ్యం వుండదు. తత్త్వవేత్త పూర్ణుడు, సమదర్శి కావున ఈ లోకంలోనే ముక్తుడవుతాడు' జ్ఞానికి ఏలాంటి కర్తవ్యం లేనందున 'కర్మ చేస్తూనే వంద సంవత్సరాలు జీవించేందుకు ఇచ్ఛగించు అనే నియమం కేవలం అజ్ఞానుల గురించే చెప్పబడింది. లేదా 'కుర్వన్నేవేహ' ఇత్యాది వాక్యాలు కర్మ చేసేదానికి నియామకాలు కాదు కాని జ్ఞానం యొక్క గొప్పతనాన్ని చూపించే ఉద్దేశ్యంతో మరియు జ్ఞాని స్వేచ్ఛానుసారంగా కర్మానుష్ఠానాన్ని సూచించే కొరకని మనం తెలిసికోవాలి.

ఇంకో విషయం గూడ చెప్పబడింది- విద్వాంసుడు స్వేచ్ఛగా జీవితపర్యంతం పుణ్యపాపాది కర్మలు చేసినా జ్ఞానప్రభావం చేత అతనికి ఆ కర్మల దోషం అంటదు. విషయమేమంటే 'ఈశావాస్య మిదగ్ం సర్వమ్' ఇక్కడి నుండి మొదలు 'తేన త్యక్తేన భుంజీథా' వరకు సర్వకర్మపరిత్యాగ పూర్వక ఆత్మరక్షణ ప్రతిపాదన చేసినందువలన బ్రహ్మవేత్తకు ఏ కర్మ విధానం లేదు. అయినప్పటికి అలాంటి వారికి సర్వకర్మ పరిత్యాగ విధానం చేయడం అనుచితమని వేదమాత చకితురాలైంది. దీనిని సూచించే కొరకే బ్రహ్మజ్ఞానికి కర్మత్యాగాన్ని విధించలేదు. జ్ఞాని ఈలోకంలో జీవిత పర్యంతం యథాప్రాప్త

పుణ్యపాపకర్మలను చేస్తూ జీవించేందుకు ఇచ్ఛగించు. పుణ్యపాపాది ఫలాలు బంధనహేతువులనే భయంతో ఆ కర్మలను త్యాగం చేసి ఉదాసీనభావంతో ఉండవల్సిన పని లేదు. ఈరకంగా శేషజీవితపర్యంతం కర్మలు చేసినప్పటికీ బ్రహ్మవేత్తకు స్వరూపచ్యుతి కలుగదు. పుణ్యపాపాదులచే లభించే జననమరణరూప సాంసారిక సంసర్గం కూడ వుండదు. ఎందుకంటే 'బ్రహ్మవేత్తలో వుండే కర్మఫలం తనకు అంటబోదు'. ఇలాగే వేరే శ్రుతులు గూడ చెప్పుచున్నవి. 'జ్ఞాని పాపకర్మలచేత అంటబడడు' 'ఈవిధంగా తెలిసికున్న వారికి పాపం అంటదు.' 'బ్రహ్మవేత్తను పుణ్యపాప కర్మలు దుఃఖాన్ని కలుగజేయవు' 'ఈరకంగానే ఇతని సమస్త పాపాలు నష్టమవుతాయి.' లింగపురాణంలో గూడ జ్ఞానాగ్ని సర్వకర్మలను భస్మం చేస్తుంది. జ్ఞానియొక్క సమస్త కర్మలు జీర్ణించిపోతాయి. అతను నానారకాల పుణ్యపాపాలతో క్రీడిస్తూ గూడ వాటిచేత అంటబడడు. ఇందులో ఏమాత్రం సందేహం లేదని చెప్పబడింది.

శివధర్మోత్తరంలో చెప్పబడిన మాట : 'జ్ఞానియగువాడు సకామ, నిష్కామ భావంతో చేసిన సమస్త కర్మబంధాల్ని తన జ్ఞానరూపఖడ్గంతో ఛేదించి శుద్ధుడై తన ఆత్మస్వరూపంలో స్థితుడౌతాడు. బాగా ప్రజ్వలించే అగ్ని పచ్చి కట్టెలను, ఎండుకట్టెలను గూడ కాల్చివేసినట్లు జ్ఞాని జ్ఞానాగ్నిచేత శుభాశుభకర్మలను క్షణంలో భస్మం చేస్తాడు. తామరాకు తనపైనబడిన నీటిని అంటనట్లు శబ్దాది విషయ రూపనీటిలోనున్నప్పటికీ జ్ఞాని వాటిచేత అంటబడడు. సర్పమంత్రాలు తెలిసినవాడు సర్పాలతో ఆడుకున్నప్పటికీ వాటిచేత కరువబడనట్లు జ్ఞాని ఇంద్రియరూప విషసర్పాలతో ఆడుకున్నప్పటికీ వాటిచేత కరువబడడు. విషం తిన్నవాడు మంత్ర ఓషధుల ప్రభావంతో జీర్ణం చేసుకున్నట్లు జ్ఞాని సమస్త పాపాల్ని క్షణంలో జీర్ణం చేసుకుంటాడు.'

సూత్రకారులగు శ్రీవ్యాస భగవానులు చెప్పుచున్నారు : 'పురుషార్థో ఽతః శబ్దాదితి బాదరాయణః' ఈ సూత్రం ద్వారా జ్ఞానమే పరమ పురుషార్థ కారణమని చెప్పి 'శేషత్వాత్ పురుషార్థవాదో యథా' అను సూత్రం ద్వారా కర్మాపేక్షిత కర్తను ప్రతిపాదన చేసినందున విద్యకు కర్మశేషత్వం సందేహించి 'అధికోపదేశాత్తు బాదరాయణః' అను సూత్రం ద్వారా కర్తృత్వసాంసారిక ధర్మరహిత అపహతపాప్మత్వాది స్వరూప బ్రహ్మమునుపదేశించినందున జ్ఞానపూర్వక కర్మాధికార సిద్ధిని ఆశించే జీవుడు ఆ కర్మాధికారానికి కారణ భూతమైన అవిద్యాజనిత క్రియాకారకఫలరూప సమస్త సంసార స్వరూపాన్ని జ్ఞానప్రభావం వల్ల వినాశం చూడబడుచున్నది. కర్మాధికారోచ్ఛేద ప్రసంగము చేత కర్మజ్ఞానముల భిన్నభిన్న ప్రకరణాలు, భిన్నభిన్న క్రియలు చూడబడు చున్నందున వాటి పరస్పర వికల్పాలు, సముచ్చయము లేదా అంగాంగీభావం ఏమాత్రమూ కాజాలవు. ఈవిధంగా ప్రతిపాదన చేసి 'అత ఏవ చాగ్నీంధ నాద్యనపేక్ష' ఈ సూత్రం ద్వారా జ్ఞానమే పరమ పురుషార్థ కారణ మగుటచే తన క్రియలో ఆశ్రమోచిత అగ్ని, ఇంధనాది కర్మలు జ్ఞానసిద్ధికి అపేక్షితములు కావని పూర్వోక్తాధికరణ ఫలాన్ని ఉపసంహారం చేసి జ్ఞాన ప్రాప్తికి కర్మలు ఏమాత్రం ఆవశ్యకత లేదని ప్రాప్తించినందున 'సర్వాపేక్షా చ యజ్ఞాదిశ్రు తేరశ్వవత్' ఈ బ్రహ్మసూత్రం ద్వారా కర్మలు జ్ఞానానికి పూర్తిగా అవసరం లేదని కాదు. కాని జ్ఞానోత్పత్తి గలిగిన తరువాతనే ఫలసిద్ధి కొరకు వేరే వస్తువు అవసరాన్ని అపేక్షించదు. జ్ఞానోత్పత్తికి ముందు మాత్రం 'వివిదిషన్తి యజ్ఞేన దానేన తపసా ఽనాశకేన' అను శ్రుతిద్వారా యజ్ఞాదికర్మలు జ్ఞానసాధనలో అత్యావశ్యకమని సూచించింది. ఆ తరువాత 'నావిశేషాత్' 'స్తుతయే ఽనుమతిర్వా' అను ఈ రెండు సూత్రాల చేత 'కుర్వన్నేవేతి' అను మంత్రము ద్వారా కర్మలు అజ్ఞానికి మాత్రమేయని జ్ఞానగొప్పదనాన్ని రెండు అంశాలుగా సూచించబడింది. పూర్వోక్త ప్రకారం జ్ఞానం మాత్రమే మోక్షానికి ముఖ్యసాధనత్వమగుటచే తరువాతి ఉపనిషత్తు ప్రారంభించుట

ఉచితము.

పూర్వపక్షము : ఒకవేళ జీవుని బంధము మిథ్య అయితే అది జ్ఞానంతో నివృత్తమయ్యేది. జ్ఞానంతో అమృతత్త్వ ప్రాప్తి కలిగేది. కాని అలా కాదు. ఎందుకంటే బంధమనేది ప్రత్యక్షసిద్ధం. ఇది బాధింపబడదు. యుష్మదాది సిద్ధ (నీవు నేను) రూపంలో ప్రతీతమయినందున ఆత్మస్వరూపం అన్నిటికంటే విలక్షణమైంది. అందువలన దానికి సరియైన సాదృశ్యం లేదు. దానియందు అన్యవస్తువు అధ్యాస కలగడం అసంభవం కాదు.

సమాధానం : ప్రత్యక్ష సిద్ధమగుటచే బంధం సత్యమని చెప్పబడదు. ఎందుకనగా సత్యాసత్యాలు రెండూ కనుపించే వస్తువుల్లో సమానంగా చూడబడుతూనే వున్నాయి. బాధింపబడనందున సత్యమని చెప్పే దానికి వీలులేదు. ఎందుకంటే శాస్త్రవిధి మరియు కారణదృష్టి చేత అది బాధింపబడడం సంభవమే. ఎలాగంటే 'దానికంటే భిన్నంగా రెండవది లేదు' 'ఏకత్వమే' 'ద్వైతం లేదు'. స్వరూపజ్ఞానం కలిగిన తరువాత వేద్యాభావమవుతుంది. 'ఒకటే అద్వితీయం' 'వాచారంభణం కేవలం నామామాత్రమే' 'ఒకటే సద్వస్తువు' 'దీంట్లో నానా అనేది ఏమాత్రం లేదు' 'సర్వం ఏకత్వంగా గ్రహించాలి' 'ప్రకృతిని మాయగా గ్రహించు' 'మాయావి యైన పరమాత్మ ఈ సంపూర్ణసృష్టికి కారణం' 'ఇంద్రుడు (పరమాత్మ) మాయచేత అనేక రూపాలుగా వ్యవహారం చేస్తాడు' ఇత్యాది వాక్యాలద్వారా శ్రుతి ప్రపంచాన్ని మిథ్యాత్త్వమని, మాయామూలకత్వమని ప్రతిపాదిస్తూ వుంది. శ్రీమద్భగవద్గీతలో గూడ పరమాత్మ 'నేను జన్మ రహితుడను, అవినాశి, సంపూర్ణ ప్రాణులకు ప్రభువును. అయినప్పటికీ నా మాయను ఆధారంగా చేసుకుని జన్మను తీసుకుంటున్నాను.' 'ఆ జ్ఞేయవస్తువు ఆకాశం వలె సమస్త శరీరాల్లో అవిభక్తమై ఏకమై వుంది. అయినా సమస్త ప్రాణుల్లో విభవక్తమైనట్లు గోచరిస్తుంది.' **(సశేషం)**

మంగళం - జయ మంగళం

రచయిత - ఆచార్య కె. సర్వోత్తమరావు, (తిరుపతి)

1. 'మంగళ' శబ్దార్థం : మంగళ శబ్దానికి 'మంగళం సుఖం లాతీతి మంగళమ్' అని వ్యుత్పత్తి. ఈ శబ్దానికి శ్రేయసం, శివం, భద్రం, కల్యాణం, మంగళం, శుభమ్' అని అమరం పర్యాయశబ్దాలను పేర్కొంది. నిఘంటువులలో మంగళ శబ్దానికి బంగారం, సిందూరం, మారేడు, పెరుగు అనే అర్థాలు కనిపిస్తాయి. సుఖాన్ని ప్రసాదించేది. ధన్యుని పొందేది మంగళం అని సారాంశం.

సామాన్యుల వ్యవహారంలో వినబడే పదాలు మంగళవారం, మంగళహారతి, మంగళసూత్రం, మంగళగౌరీవ్రతం మొదలయినవి. వారంలో మూడవరోజు- మంగళవారం. ఈ వారానికి కుజవారమని, అంగారక వారమని, జయవారమని, చరవారమని పేర్లున్నాయి. పూజాదికాలలో చివరి కార్యక్రమం 'మంగళహారతి'. వివాహాదులలో వరుడు వధువు మెడలో కట్టేది 'మంగళసూత్రం'. శ్రావణమాసంలో ముత్తైదువలు భక్తిశ్రద్ధలతో ఆచరించే వ్రతాలు మంగళగౌరీవ్రతాదులు.

2. శ్రీ మద్రామాయణంలో కౌసల్య మంగళాశాసనం- సంస్కృత వాఙ్మయంలో ఆదికావ్యం శ్రీమద్రామాయణం. ఆ ఇతిహాస రచయిత వాల్మీకి. ఆ కవి కళ్ళార దర్శించిన వ్యక్తి చరిత్రే రామాయణం. ఆ కారణం వల్ల కల్పనలకు అవకాశం చాల తక్కువ. ఇలాంటి రామాయణంలో అయోధ్యకాండలో 25వ సర్గలో కౌసల్య మంగళాశాసనం కనిపిస్తుంది. ఈ మంగళాశాసనం తల్లి హృదయాన్ని మనోహరంగా, వాత్సల్యాత్మకంగా ఆవిష్కరించే భాగం.

శ్రీరామచంద్రుడు కైక ఆనతి ప్రకారం వనవాసానికి సిద్ధమయ్యాడు. ఆపై తల్లి కౌసల్య అంతఃపురం చేరుకొని తన వనవాసం

గురించి విశదం చేశాడు. ఈ వార్త వినగానే కౌసల్యకు తెలివి తప్పింది. శ్రీరామచంద్రుడు ఆమెను లేవనెత్తగా కౌసల్య తదేకంగా రాముని చూస్తూ విలపించింది. తాను కూడా వనవాసానికి వస్తానని పట్టుబట్టింది. అపుడు రాముడు 'పతిసేవ సతిధర్మ'మని నొక్కి చెప్పాడు. ఆపై కౌసల్య శ్రీరాముల వనవాసానికి అంగీకరించింది. చివరకు దుఃఖాన్ని దిగమ్రింగుకొని ఆచమనం చేసి పవిత్రురాలయి 'మంగళక్రియలను' పూర్తి చేసింది. ఈ అంశాన్ని వాల్మీకి అయోధ్యకాండలో 25 శ్లోకాలలో వర్ణించాడు.

సాపనీయ తమాయాస ముపస్పృశ్య జలం శుచిః

చకార మాతా రామస్య మంగళాని మనస్వినీ అని స్పష్టం చేశాడు.

25 శ్లోకాలనడంలో అంతరార్థముంది. మనకు తెలిసిన తత్త్వాలు 24. 25వ తత్త్వం పరమాత్మ. మహాత్ముల వాక్కులు గంభీరాలు. భవిష్యత్కథా సూచకాలు.

'తల్లి దీవెన ఆకాశమంత. దేవుని దీవెన దీపమంత' అని సామెత. బిడ్డముందు గుర్తించేది తల్లిని. బిడ్డకు తల్లే మొదటి గురువు. అంతేకాదు కౌసల్యకు రాముడు కానకకన్న సంతానం. అలాంటి బిడ్డ కాననావాసానికి సిద్ధమయినవేళ తల్లి ఆరాటం సహజం. అయినా క్షత్రియకాంతగా నిబ్బరం తెచ్చుకొంది. మొదట వాగ్రూప ఆశంసలు చేసింది. ఆపై 'స్వస్తి' పలికింది. తదనంతరం హెూమాదులు ఆచరించి మంగళాన్ని ఆకాంక్షించింది.

వాగ్రూపమయిన ఆశంసలో ఎన్నో రహస్యాలు దాగి వున్నాయి. వాటిలో మొదటిది **'ధర్మరక్ష'** -

త్రేతాయుగంలో ధర్మదేవత మూడు పాదాలతో నడుస్తుందంటారు. రాజు ధార్మికుడు కావాలి. అతడు ధర్మదీక్షా నిష్ఠుడయినప్పుడే ఇతరులు ధర్మాన్ని ఆచరిస్తారు. **ధర్మో రక్షతి రక్షితః** రాములవారు బాల్యం నుండి ధర్మైకమతి. ఇందుకు విశ్వామిత్రుని వెంట యాగరక్షణ కోసం కదలడం.

స్త్రీవధ పాపమని తాటకి విషయంలో సంశయించినా ధార్మికమతితో ఆమెను సంహరించడం. అలాగే అహల్యాశాప విమోచనం. ఆపై శివ ధనుర్భంగం. ఇవన్నీ ధర్మదీక్షతో కొనసాగినవే. అంతేకాదు తండ్రి ఆన అని తెలిసి అడవులకు కదలడం. అందుకే కౌసల్య అరణ్యవాసంలో ధర్మమే రక్షిస్తుందని విశ్వసించి **'ధర్మస్త్వామభిరక్షతు'** అని ఆశీర్వదించింది. రెండవది **దేవతాశీర్వాద ఆశంస –**

హైందవంలో ముక్కోటి దేవతలనే విశ్వాసముంది. దేవతలు అదృశ్యరూపులు. వరానుగ్రహసిద్ధులు. సేవ్యమానులు. తమ్ము సేవించేవారిని, తమపట్ల విశ్వాసం కలవారిని సదా రక్షించేవారు. ఈ దృష్టితో కౌసల్య 'దేవతలు, మహర్షులు వనవాస సమయంలో **'అభిరక్షన్తు'** అంది. దేవతలు అదృశ్యరూపులయితే, వనాలలో మహర్షులు వరానుగ్రహ పాత్రులు. ఇక మూడవది **అస్త్రరక్షణాశంస'** –

దశరథమహారాజు శ్రీరాముని అరణ్యవాసి అయిన విశ్వామిత్రుని వెంట పంపడానికి వెనకడుగులు వేశాడు. 'విశ్వామిత్రుని శక్తి సామర్థ్యాలు తెలిసిన కులపురోహితుడయిన వశిష్ఠుడు 'విశ్వామిత్రులు అస్త్రశస్త్ర సంపన్నులు. వారి అనుగ్రహం రాములవారికి మేలే చేకూరుస్తుంద'ని సవినయంగా చెప్పాడు. వశిష్ఠుడు చెప్పింది అక్షరాల సత్యం. విశ్వామిత్రుడు బల, అతిబలాదులను అనుగ్రహించడమే కాకుండా ఎన్నో అస్త్రాలను ప్రసాదించాడు. మంత్రపూర్వకంగా ప్రయోగింపబడేది అస్త్రం. ఈ దృష్టితో శ్రీరాముల వారికి విశ్వామిత్ర దత్త 'అస్త్రాదులు' సర్వదా త్వాం అభిరక్షన్తు' అని చెప్పింది. ఆ తరువాత **'సత్యరక్షణ'–**

'సత్యమేవ జయతే' అని వేదం. ఆ వేదమే **మాతృదేవోభవ, పితృదేవోభవ** అన్నది. వారి ఆశీస్సులు సర్వదా రక్షాకవచాలు. సంతానం యోగక్షేమాదులను సర్వదా కాంక్షించేవారు తల్లిదండ్రులు. ఇది ముమ్మాటికి సత్యం. కనుక కౌసల్య **'సత్యేన అభిరక్షితః'** అన్నది.

పెద్దల దీవెనలో అంతరార్థముంది. భారతంలో అభిమన్యువు పద్మవ్యూహ ప్రవేశానికి సిద్ధమై ధర్మరాజాదులకు నమస్కరించాడు. లోకంలో పిన్నలు నమస్కరిస్తే పెద్దలు మొదట 'చిరంజీవ' అనడం సంప్రదాయం. కాని విధి ధర్మరాజునోట ఈ మాట పలికించలేదు. పైగా 'నీ శౌర్యాన్ని విరోధులు ప్రశంసిస్తారు. లోకోత్తరమయిన నీ పరాక్రమం కీర్తింపబడుతుందనే' చెప్పాడు. అభిమన్యు మరణానికి ఇది కూడా కారణమే.

ఇలాంటిదే మరొకటి. రారాజు కదనరంగానికి కదలివెళుతూ తల్లి ఆశీస్సుల కోసం 'గాంధారి' దగ్గరికి వచ్చాడు. నమస్కరించాడు. తల్లి **'యతో ధర్మః తతో జయః'** అన్నది. జయోస్తు అనలేదు. చిరంజీవ అనలేదు.

కౌసల్య చిరకాలం జీవించుమని దీవించింది. ఆ కారణంగానే రాములవారు వేల సంవత్సరాలు పరిపాలించాడు. ఆపై ఆశంస **ప్రకృతి సంరక్షణ –**

ప్రకృతి సువిశాలం. ఈ ప్రకృతిలో స్థావర జంగమాలున్నాయి. చరించేవి కొన్ని. చరించనివి కొన్ని. కాలం బాగా లేకపోతే ఇవే కాటు వేస్తాయి. అందుకే సమిధలు, కుశలు, పక్షి, సర్ప, సింహాదులు రక్షించుగాక! అని ఆశంసించింది. 'త్వాం రక్షన్తు నరోత్తమ' అంది. ఈ వాక్యంలోని నరశబ్దం విశేషార్థబోధకం. విష్ణువు సామాన్య నరుడుగా అవతరించిన అవతారం శ్రీరామావతారం. అందుకే 'నరోత్తమ' సంబోధన. శ్రీరామావతారంలో 'నరత్వమే' ఎక్కువ.

ఈ శ్లోకంలో విశేషార్థముంది. పర్వతం ఋష్యమూకాన్ని సూచిస్తుంది. వృక్షం తాళవృక్ష భేదనాన్ని గుర్తుకు తెస్తుంది. మొక్క 'సంజీవని' ఔషధాన్ని స్ఫురింప చేస్తుంది. పక్షులు జటాయువు, సంపాతులకు సంకేతం. సింహం వానరసింహాలను, సమిధలు, దర్భలయొక్క ప్రస్తావన వనవాసంలో యాగాది రక్షణలను తలపిస్తాయి. అంతేకాదు సముద్రుడు దారి యివ్వనివేళ రాముడు దర్భశయనుడు కావడాన్ని సూచిస్తాయి. వీటినే

'వాచమర్థోనుధావతి' అంటారు. ఆ తరువాతిది **సకలలోకపాలక వరానుగ్రహం** -

మానవబలం పరిమితం. అంతకంటె మించింది దైవబలం. లోకపాలకుల ఆశీర్వాదబలం. కనుకనే కౌసల్య -

స్వస్తిసాధ్యాశ్చ విశ్వే చ మరుతశ్చ మహర్షయః

లోకపాలాశ్చ తే సర్వే వాసవప్రముఖా స్తథా - అని దీవించింది. ఈ వాక్యాలలో అరుంధతీ వశిష్ఠుల దీవెనలు, భరద్వాజ ఋషి ఆశీస్సులు, సమరరంగంలో రాముడు విరథుడయి పోరాడేవేళ ఇంద్రుడు మాతలితో తన రథాన్ని పంపడం సూచితాలు. ఆపై **కాలపురుష అనుగ్రహ ఆశంస**-

భారతీయుల కాలగణనం విశిష్టం. పగలు, రేయి, దినం, వారం, నెల, మాసం, సంవత్సరాలు, ఋతువులు, ముహూర్తాలు. రాములవారు ఒక్కరోజు కాదు ఒక్క సంవత్సరం కాదు 14 ఏళ్ళు వనంలో గడపాలి. అందుకే కౌసల్య 'స్వస్తి కుర్వన్తు తే సదా' అన్నది. ఆపై **దిక్పాలక రక్షాశంస**-

కౌసల్య శ్రీరాములవారికి దిక్పాలకుల ఆశీస్సులు కూడా అవసరమని గుర్తించింది. అందుకే

యాశ్చాపి సర్వతః సిద్ధా దిశశ్చ సదిగీశ్వరాః

స్తుతా మయా వనే తస్మిన్ పాన్తు త్వాం పుత్ర నిత్యశః అన్నది. సర్వదిక్కులయందున శ్రీరాములవారి కీర్తి జగజ్జేగీయమానవుతుందని ధ్వని. ఆపై **దేవదైత్య సంరక్షణాకాంక్ష**-

శ్రీరామా! మునివేషంలో సంచరించే ధీమంతుడవయిన నీకు దేవతలు, దైత్యులు సర్వదా సుఖము ప్రసాదింతురుగాక ! అని ఆశీస్సు. ఇది కూడా అర్థగర్భితం.

దేవతలు రాముని సంరక్షిస్తారనడంలో అవంత సందేహం లేదు. కాని దైత్యులు సంరక్షిస్తూ దీవిస్తారనడంలో విభీషణ, త్రిజటాదులు గుర్తుకు వస్తారు. రాక్షసులలోను శ్రీరామభక్తులున్నారని సూచన. కనుకనే వారందరు **'భవన్తు సుఖదాః సదా'** అంది కౌసల్య. ఆపై **'అభయ'** రక్షణ-

నిర్భయత్వం వేరు. భయరక్షకత్వం వేరు. అందుకే కౌసల్య

రాక్షసానాం పిశాచానాం రౌద్రాణాం క్రూరకర్మణామ్

క్రవ్యాదానాం చ సర్వేషాం మాభూత్ పుత్రక! తే భయమ్ -అంది.

క్రూరకర్ములు. భయంకరాకారులయిన రాక్షసులు, పిశాచాలు, మాంసాహారులు, అలాగే విషక్రూర జంతువుల నుండి నీకు భయం లేకుండుగాక ! అని భావం. అలాగే తరువాతి శ్లోకంలో వృశ్చిక, కీటక, గజ, సింహ, వ్యాఘ్ర, భల్లూకాలనుండి అపకారం కలగకుండుగాక! అంది. చివరకు ఇవన్నీ నిన్ను ఏమీ చేయలేవు. కారణం నేను అయోధ్యలో నీ క్షేమార్థం పూజాదులు చేస్తుంటాను. కుమారులు సుదూర ప్రాంతాలలో ఉన్నా తల్లులు వారి క్షేమం కోసం వ్రతాలు, నోములు, ఉపవాసాలు, ఆలయదర్శనం లాంటివి చేయడం తెలిసిందే. ఇక తరువాతిది **'మంత్రరక్ష'**-

వైదిక వాఙ్మయంలో ప్రతిమంత్రానికి అధిదేవత ప్రస్తావన ఉంది. అథర్వ వేదంలో అయితే లౌకికాంశాల వివరణ చాల ఎక్కువ. తంత్రం, మంత్రం పడుగు పేకల్లాంటివి. మంత్రజపం, నిష్ఠ, దేవతలను సంతృప్తి పరుస్తుందనడం సత్యం. కనుకనే అరణ్యంలోని అగ్ని, వాయు, ధూమాదులు ఉపశమనానికి సంబంధించిన మంత్రాలు రక్షించుగాక! అని కౌసల్య, త్వాం రక్షంతు వనవాసినమ్' అని ఆశంస తెలియజేసింది. ఆపై **ప్రత్యేక భగవత్స్వరూపుల దీవెనల రక్ష** - (సశేషం)

జగత్సాక్షి

\- శ్రీ విద్యాప్రకాశానందగిరి స్వాములవారు

సర్వభూతాత్మ దృక్ సాక్షాత్ తస్యాగమన కారణమ్

విజ్ఞాయాచిన్తయన్నాయం శ్రీకామో మాభజత్ పురా (భాగవతము-దశమస్కంధము)

తా ॥ శ్రీకృష్ణుడు సమస్త ప్రాణులయొక్క హృదయమందలి ప్రతి సంకల్పమును, దానియొక్క అభావమును తెలుసుకొనుచున్నారు. వారు సుదాముడు వచ్చిన కారణమును, వారి హృదయమందలి భావమును ఎఱిగియున్నారు. అప్పుడు వారిట్లు తమలో విచారింపదొడగిరి. "వీరు నాకు ప్రియమిత్రులు, ఇంతకుముందు ఎపుడును ధనాదులకొరకై నన్ను ఆశ్రయింపలేదు"

వ్యాఖ్య : ఈ శ్లోకము భాగవతము దశమస్కంధమున గలదు. శ్రీ శుకమహర్షి పరీక్షిన్మహా రాజునకు ఈ ప్రకారముగ చెప్పెను. కుచేలుడు తన బాల్యమిత్రుడగు శ్రీకృష్ణుని దర్శించుటకు గాను కొద్దిగ అటుకులను మూటకట్టుకొని బయలుదేరెను. శ్రీకృష్ణపరమాత్మ సమస్త జగత్తునకు సాక్షియగుటచే కుచేలునియొక్క వృత్తాంతమంతయును వెంటనే తెలుసుకొనెను. ప్రతి సంకల్పమునకు అధిష్ఠానము ఆత్మ. కాబట్టి ఆత్మకు తెలియకుండా ఏ సంకల్పమున్ను ఏ ప్రాణికి ఉదయింపజాలదు. సర్వసాక్షియగు శ్రీకృష్ణపరమాత్మ కుచేలుని వృత్తాంతమంతయు ముందుగనే తెలుసుకొని ఆతని దారిద్ర్యమును పోగొట్టుటకై గొప్ప సంపదను ఆతనికి అనుగ్రహించెను.

కొందరు ఏకాంతమున ఎవరూ చూడకుండ పాపకార్యములను చేసి, తమనెవరూ గమనించలేదని తలంతురు. కాని వారి హృదయమున వెలయుచున్న పరమాత్మ సాక్షిగయుండి వారు చేయుచున్న దుష్కృత్యములన్నిటిని గాంచుచున్నారు.

విశ్వప్రభుత్వమువారు సమస్త జీవులయొక్క పాపపుణ్యములను గమనించుచూ వాటికి తగిన అశుభ, శుభఫలములను ఒసంగుచున్నారు. పాపమునకు దుఃఖము, పుణ్యమునకు సుఖము. జ్ఞానమునకు మోక్షము కలుగజేయుచున్నారు.

కాబట్టి జనులు తాము చేయు కార్యములందు బహూజాగరూకత గలవారై పాపమునకు ఏమాత్రము అవకాశమివ్వక పుణ్యకార్యములను, శుభకార్యములను, దైవకార్యములను మాత్రమే ఆచరించుచూ జీవితమును సద్వినియోగపరచవలెను.

మానవ జీవితము అమూల్యమైనది. కనుక జీవుడు అనేక జన్మములలో చేసిన పాపమును, పుణ్యము ద్వారా క్షాళనమొనర్చివైచి, చిత్తశుద్ధిని బడసి, మహాత్ములకు సేవాశుశ్రూషల గావించుటచేతను, వారి 'బోధల' నాలకించుట చేతను ఆత్మజ్ఞానమును సంపాదించి బంధవిముక్తిని పొందవలెను. జపధ్యానాదుల ద్వారా భగవత్కృపను బడసి ధన్యుడు కావలెను.

ఆదర్శ గురువు

\- వేదాచార్య డా॥ మల్లి కృష్ణారెడ్డి

పరీక్ష్య లోకాన్ కర్మచితాన్ బ్రాహ్మణో నిర్వేదమాయాన్నాస్త్యకృతః కృతేన ।
తద్విజ్ఞానార్థం స గురుమేవాభిగచ్ఛేత్ సమిత్పాణిః శ్రోత్రియం బ్రహ్మనిష్ఠమ్॥

ముండకోపనిషత్తు 1-2-12.

వివేకం గలవాడు కర్మలచే కలుగు ఫలితాలను బాగా పరీక్షించి 'ఈ ప్రపంచంలోని వస్తువులన్నీ శాశ్వతానందాన్ని ఇవ్వలే'వని తెలిసికొని వైరాగ్యాన్ని పొంది శాశ్వతానంద ప్రదాతయగు పరబ్రహ్మను తెలుసుకొనుటకు సమిత్పాణియై శ్రోత్రియుడు, బ్రహ్మనిష్ఠుడునైన గురువును ఆశ్రయించాలి.

గురువు ఎందుకు? మనం మనకు తోచిన విధంగా ప్రయాణం చేస్తుంటే దారితప్పే అవకాశముంది. సకాలంలో చేరుకోవాల్సిన గమ్యాన్ని చేరుకోలేం. దారిలో మార్గసూచనలు లేకుంటే ప్రయాణంలో దారి తప్పే అవకాశాలు చాలా ఉంటాయి. దారి తెలియక పెడదారినపడి పెనుఇబ్బందులకు గురికావలసి వస్తుంది. అందుకే మార్గసూచనలు, మార్గదర్శుల సలహాలు అవసరం. మానవ జీవిత లక్ష్యం మోక్షాన్ని పొందడం, జననమరణాలు లేని స్థితిని పొందడం. ఇంతటి గొప్ప లక్ష్యమున్న మానవ జీవితాన్ని సన్మార్గంలో నడిపించి, సకాలంలో గమ్యాన్ని చేరుకునేటట్లు నడిపించే గురువు అవసరం. అతడు తన జ్ఞాన బోధనలతో జీవితమార్గాన్ని చూపగలడు. స్పష్టమైన ఆలోచనలను ఇవ్వగలడు. తగిన సమాచారాన్ని ఇచ్చి సహాయం చేయగలడు. ఇలా చక్కనైన తరించే రహదారిని చూపేవారినే 'గురువు' అంటారు.

ఆత్మజ్ఞానాన్ని తెలుసుకోవాలనే తపనగల జిజ్ఞాసువులకు మంచి గురువు దొరుకుతాడు. ఎవరి సాన్నిధ్యంలో తనలో సరియైన మార్పు

కలుగుతుందో, ఎవరు నిరాడంబరమైన, ఆదర్శమైన జీవితాన్ని గడుపుతున్నారో, ఎవరిని ఆశ్రయిస్తే శాంతి లభిస్తుందో వారినే తనకు సరియైన గురువుగా తెలుసుకుంటాడు. నిస్వార్థమైన సేవాతత్త్వం గల గురువే పరిపూర్ణత చెందినవాడనడానికి గీటురాయి. ఇలాంటి వ్యక్తినే "సద్గురువు"గా స్వీకరించాలి. వేదవిద్య, ఆధ్యాత్మిక విద్య, యోగవిద్య లేకుండా డంబాచారం, ధనార్జన, స్వీయ ప్రచారం, ఆడంబరం, దిఖావట్, షోపుటాపు గలవానిని "దుర్గురువు"గా భావించాలి.

గురువులందరికీ ఒకటే లక్ష్యముంటుంది. తన చుట్టూ చేరినవారి నిజస్వరూపాన్ని గుర్తుచేసి, వారు అమరులని, జ్ఞానస్వరూపులని ఎవరికి వారు అనుభవ పూర్వకంగా తెలుసుకునేటట్లు చేస్తారు. వారికి మార్గదర్శనం చేయటమే వారి లక్ష్యం.

గురువు మార్గదర్శి : పర్వతారోహణానికి సాధనాలు, శిక్షణ ఎలా అవసరమో అంతరంగ (మోక్ష) ప్రయాణానికి కూడా అవి అవసరం. ఆ జిజ్ఞాస ఉన్నవాడు గురువు కొరకు అన్వేషణ చేస్తాడు. అలాంటి గురువును గుర్తించి ఆశ్రయిస్తాడు. గురువు యొక్క సాన్నిధ్య ప్రభావంతో సాధకుడైన శిష్యునిలో మార్పు వస్తుంది. అది అయస్కాంతం ముందుగల ఇనుపముక్కలో కలిగిన మార్పు వంటిది. గురువు యొక్క సదాచరణ శిష్యునిలో సత్ప్రేరణ కలిగిస్తుంది. ఆ ప్రేరణ శిష్యుని ప్రజ్ఞను ఊర్ధ్వముఖం చేస్తుంది. అతడు చేయు సాధనలో నాణ్యతను మెరుగుపరుస్తుంది.

ఆ గురువులకు గురువు ఎవరు? మానవసృష్టి ప్రారంభమైన నాటి నుండే జ్ఞానం కూడా ఉన్నట్లు వేదశాస్త్రాలు తెలుపుచున్నవి. అలాగే గురుశిష్య సంప్రదాయమూ ఆనాటి నుండే ప్రారంభమైనది.

యోగదర్శన శాస్త్రంలో "సః -పూర్వేషామపి గురుః కాలేనాన

వచ్ఛేదాత్. (యోగ. ద. 1-24) సమస్త జీవుల హృదయాలలో ఉన్న దైవమే సమస్త గురువులకు గురువు" అని ఉంది. సమస్త జ్ఞానానికీ, పరిపూర్ణతకూ అతడే బీజం. అతడే జీవులందలి దైవప్రజ్ఞ. అది ఒక తత్త్వం. మనిషి కాదు. సమస్త జీవుల అంతరంగంలో అతడున్నాడు. అందుకే మనకంటే ముందే వచ్చినవారిచేత గురువుగా సేవింపబడ్డాడు. అతడే పరమగురువు.

ఆ పరమగురువే జగద్గురువు : సృష్టి స్థితిలయకారకుడైన ఆ పరమేశ్వరుడే జగద్గురువు. జగత్తునంతటినీ అతడే త్రికాలాతీతుడై నడిపిస్తున్నాడు. అతని స్వరూపమే గురుతత్త్వము. కాని చాలామంది పరమగురువైన పరమేశ్వరుని గురుతత్త్వం కంటే గురుబోధ చేసిన లౌకికులైన అనగా పుట్టి మరణించినవారి రూపాలకే - ప్రతిరూపాలకే ప్రాధాన్యతనిస్తున్నారు. అటువంటివారు ఈ లౌకిక గురువుల వ్యక్తిత్వం చుట్టూ ఒక విధమైన ఆరాధనా విధానాన్ని, మతాన్ని తయారు చేసి ఇతరుల యెడల అసూయ కలిగి ఉంటారు. కానీ, ప్రతి గురువు నిజానికి జగద్గురువు తత్వానికి ప్రతినిధియై ఉంటాడు. ఒకే గురుతత్త్వము అనేక మంది గురువుల ద్వారా పనిచేస్తుంది. ఆ గురుతత్త్వాన్నే జగద్గురువంటారు. (సశేషం)

విజ్ఞప్తి

వేదాన్తభేరి పత్రిక ఖర్చు సంవత్సరానికి రూ. 3,98,400/- అవుతూంది. జ్మ పోషక నిధి వడ్డీలు, సంవత్సర చందాలు కలిపి సంవత్సరానికి రూ. 2,40,000/-లు వస్తూంది. జ్మలు పోను సంవత్సరానికి అదనం ఖర్చు లక్షయాభై ఎనిమిది వేల రూపాయలు అవుతూంది. కాబట్టి పత్రిక నడవాలంటే వదాన్యులు పత్రికకు నిధిగా పైకం పంపి సహకరించగోరెదము.

కలుగుతుందో, ఎవరు నిరాడంబరమైన, ఆదర్శమైన జీవితాన్ని గడుపుతున్నారో, ఎవరిని ఆశ్రయిస్తే శాంతి లభిస్తుందో వారినే తనకు సరియైన గురువుగా తెలుసుకుంటాడు. నిస్వార్థమైన సేవాతత్త్వం గల గురువే పరిపూర్ణత చెందినవాడనడానికి గీటురాయి. ఇలాంటి వ్యక్తినే "సద్గురువు"గా స్వీకరించాలి. వేదవిద్య, ఆధ్యాత్మిక విద్య, యోగవిద్య లేకుండా డంబాచారం, ధనార్జన, స్వీయ ప్రచారం, ఆడంబరం, దిఖావట్, షోపుటాపు గలవానిని "దుర్గురువు"గా భావించాలి.

గురువులందరికీ ఒకటే లక్ష్యముంటుంది. తన చుట్టూ చేరినవారి నిజస్వరూపాన్ని గుర్తుచేసి, వారు అమరులని, జ్ఞానస్వరూపులని ఎవరికి వారు అనుభవ పూర్వకంగా తెలుసుకునేటట్లు చేస్తారు. వారికి మార్గదర్శనం చేయటమే వారి లక్ష్యం.

గురువు మార్గదర్శి : పర్వతారోహణానికి సాధనాలు, శిక్షణ ఎలా అవసరమో అంతరంగ (మోక్ష) ప్రయాణానికి కూడా అవి అవసరం. ఆ జిజ్ఞాస ఉన్నవాడు గురువు కొరకు అన్వేషణ చేస్తాడు. అలాంటి గురువును గుర్తించి ఆశ్రయిస్తాడు. గురువు యొక్క సాన్నిధ్య ప్రభావంతో సాధకుడైన శిష్యునిలో మార్పు వస్తుంది. అది అయస్కాంతం ముందుగల ఇనుపముక్కలో కలిగిన మార్పు వంటిది. గురువు యొక్క సదాచరణ శిష్యునిలో సత్ప్రేరణ కలిగిస్తుంది. ఆ ప్రేరణ శిష్యుని ప్రజ్ఞను ఊర్ధ్వముఖం చేస్తుంది. అతడు చేయు సాధనలో నాణ్యతను మెరుగుపరుస్తుంది.

ఆ గురువులకు గురువు ఎవరు? మానవసృష్టి ప్రారంభమైన నాటి నుండే జ్ఞానం కూడా ఉన్నట్లు వేదశాస్త్రాలు తెలుపుచున్నవి. అలాగే గురుశిష్య సంప్రదాయమూ ఆనాటి నుండే ప్రారంభమైనది.

యోగదర్శన శాస్త్రంలో "సః -పూర్వేషామపి గురుః కాలేనాన

వచ్ఛేదాత్. (యోగ. ద. 1-24) సమస్త జీవుల హృదయాలలో ఉన్న దైవమే సమస్త గురువులకు గురువు" అని ఉంది. సమస్త జ్ఞానానికీ, పరిపూర్ణతకూ అతడే బీజం. అతడే జీవులందలి దైవప్రజ్ఞ. అది ఒక తత్త్వం. మనిషి కాదు. సమస్త జీవుల అంతరంగంలో అతడున్నాడు. అందుకే మనకంటే ముందే వచ్చినవారిచేత గురువుగా సేవింపబడ్డాడు. అతడే పరమగురువు.

ఆ పరమగురువే జగద్గురువు : సృష్టి స్థితిలయకారకుడైన ఆ పరమేశ్వరుడే జగద్గురువు. జగత్తునంతటినీ అతడే త్రికాలాతీతుడై నడిపిస్తున్నాడు. అతని స్వరూపమే గురుతత్త్వము. కాని చాలామంది పరమగురువైన పరమేశ్వరుని గురుతత్త్వం కంటే గురుబోధ చేసిన లౌకికులైన అనగా పుట్టి మరణించినవారి రూపాలకే – ప్రతిరూపాలకే ప్రాధాన్యతనిస్తున్నారు. అటువంటివారు ఈ లౌకిక గురువుల వ్యక్తిత్వం చుట్టూ ఒక విధమైన ఆరాధనా విధానాన్ని, మతాన్ని తయారు చేసి ఇతరుల యెడల అసూయ కలిగి ఉంటారు. కానీ, ప్రతి గురువు నిజానికి జగద్గురువు తత్వానికి ప్రతినిధియై ఉంటాడు. ఒకే గురుతత్త్వము అనేక మంది గురువుల ద్వారా పనిచేస్తుంది. ఆ గురుతత్వాన్నే జగద్గురువంటారు. (సశేషం)

విజ్ఞప్తి

వేదాన్తభేరి పత్రిక ఖర్చు సంవత్సరానికి రూ. 3,98,400/- అవుతూంది. జ్మ పోషక నిధి వడ్డీలు, సంవత్సర చందాలు కలిపి సంవత్సరానికి రూ.2,40,000/-లు వస్తూంది. జ్మలు పోను సంవత్సరానికి అదనం ఖర్చు లక్షయాభై ఎనిమిది వేల రూపాయలు అవుతూంది. కాబట్టి పత్రిక నడవాలంటే వదాన్యులు పత్రికకు నిధిగా పైకం పంపి సహకరించగోరెదము.

శ్రీమదాంధ్ర భాగవతం - తృతీయ స్కంధం

వచనానువాదం - ఆచార్య జక్కంపూడి మునిరత్నం

(గత సంచిక తరువాయి)

శ్రీకృష్ణుడు కళ్ళారా చూశాడు. సరస్వతీ నదిలో స్నానం చేసి చనిపోయిన వాళ్ళందరికీ ఉత్తరక్రియలు నిర్వర్తించాడు.

అంతా అయ్యాక శ్రీకృష్ణుడు ఒక చెట్టు మొదట కొంతసేపు కూర్చున్నాడు. నన్ను తన దగ్గరకు పిలిచాడు. 'ఉద్ధవా ! నువ్వు బదరీవనానికి వెళ్ళు' అంటూ నన్ను మాయ ఆవహించేట్టు చేశాడు. కృష్ణుడు అక్కడ కొంతసేపు ఉండి లేచి వెళ్ళిపోయాడు. నేనతని పాదారవిందాల ఎడబాటును సహించలేకపోయాను. ఆయన్ను వెతుక్కుంటూ వెళ్ళాను. ఒక చెట్టు క్రింద నేలమీద ఆసీనుడై కనిపించాడు. అప్పుడతడు నాకు పరమాత్మగా తోచాడు. తన ఎడమ తొడమీద కుడిపాదాన్ని ఉంచి కూర్చుని ఉన్నాడు. మహాతేజోమయుడై నాలుగు బాహువులతో ప్రకాశిస్తున్నాడు. లేత రావిమానును ఆనుకొని వీరాసనంలో విరాజిల్లే కన్నయ్యను కళ్ళారా చూశాను. ఆయన్ను దర్శించడంతో మోక్షం నాకు కరతలామలకమైంది. ఆనందం అనుభవంలోకి వచ్చింది. తీర్థయాత్రలు చేస్తున్న మైత్రేయ మహర్షి కూడా ఆ సమయంలో అక్కడికి వచ్చాడు. సర్వవ్యాపకుడు, సర్వమయుడు అయిన శ్రీకృష్ణుణ్ణి సందర్శించాడు. అలా తిలకించి పులకించిన మైత్రేయ మహర్షి తాను చూసిన శ్రీకృష్ణుడి రూపాన్ని హృదయంలో పదిలపరచుకున్నాడు. కళ్ళు మూసుకొని ఆ రూపాన్ని తదేకంగా పరికిస్తూ తన్మయుడయ్యాడు. తలవంచుకొని అలాగే ఉండిపోయాడు.

మైత్రేయుడు వింటుండగా శ్రీకృష్ణుడు నాతో ఇలా ఆనతిచ్చాడు. "ఉద్ధవా! పూర్వజన్మలో నీవు వసువువు. వసు బ్రహ్మలు నిర్వహించిన సత్రయాగంలో నువ్వు మరే వస్తువును కోరలేదు. నా పాదపద్మాల సేవనే

కోరావు. కాబట్టి నేనికమీదట నీ హృదయంలో నివసిస్తూ సకలమూ చూస్తూ ఉంటాను. నా అనుగ్రహం వల్ల నీకిదే చివరి జన్మ కాగలదు. నీ పూర్వ పుణ్యం వల్ల నువ్వీ చరణారవిందాలను ఈ ఆశ్రమంలో చూడగలిగావు. పద్మకల్పంలో బ్రహ్మదేవుడికి నేను తెలియజేసిన దివ్యజ్ఞానాన్ని నీకిప్పుడు బోధిస్తాను. జనన మరణ బంధాన్ని నశింపజేసి అఖండానందమందించే నా మహత్త్వం ఆ జ్ఞానం ద్వారా నీకు బోధపడుతుంది." స్వామి మాటలు నాకు సంతోషం కలిగించాయి. ఆయనకు నమస్కరించి ఇలా విన్నవించుకున్నాను.

"పురుషోత్తమా ! నీ ధ్యానంతో పరవశించే నా మనసు ఇతర వస్తువులను ఎలా కోరుతుంది? పుట్టుకలేని నీవు పుట్టడం కాల స్వరూపుడైన నీవు శత్రుభయంతో సముద్ర మధ్యంలో దుర్గం నిర్మించుకొని నివసించడం, ఆత్మ విహారివైన నీవు అన్నువుల మధ్య విలాసంగా విహరించడం, అమాయకుడిలా ఉండడం, ఎక్కడో దాక్కొని ఉండడం నాకు వింతగా కనిపిస్తూ ఉన్నాయి. నేను అర్హుడనని భావిస్తే బ్రహ్మకు ఆనాడు ప్రసాదించిన జ్ఞానాన్ని నాకూ ప్రసాదించు." అని పలికెను.

"భగవంతుడైన శ్రీకృష్ణుడు నా మాటలు మన్నించాడు. పరతత్త్వానికి సంబంధించిన పరిపూర్ణ జ్ఞానాన్ని ప్రసాదించాడు. నేనా పరతత్త్వాన్ని గ్రహించాను. ఆ స్వామి పాదపద్మాలకు ప్రణమిల్లాను. నా స్వామి పాదపద్మాల ఎడబాటు నాకెంతో దుఃఖాన్ని కలిగిస్తూ ఉంది. అయినా భరించక తప్పదు. కల్పాంతం వరకు ఇలాగే తిరగక తప్పదు. గొప్ప మహర్షులతోనూ, అందమైన ప్రకృతితోనూ అలరారే బదరికాశ్రమానికి వెళ్ళాలనే కోరిక కలిగింది. నేను అక్కడికి వెళుతున్నాను?

ఉద్ధవుడు అలా చెప్పగానే విదురుడికి ఎంతో బాధ కలిగింది. గుండె నిబ్బరించుకొని మామూలు స్థితికి వచ్చాడు. కృష్ణుడు ఉపదేశించిన

అధ్యాత్మతత్త్వ రహస్యాన్ని కృపతో తనకు బోధించమని ఉద్ధవుణ్ణి కోరాడు. ఆ సమయంలో శరీర పరిత్యాగానికి సిద్ధంగా ఉన్న మైత్రేయ మహర్షి దగ్గరికి వెళితే విదురుడికి అధ్యాత్మతత్త్వ రహస్యాన్ని బోధిస్తాడని ఉద్ధవుడు చెప్పాడు. విదురుడూ ఉద్ధవుడూ కలిసి ప్రయాణం సాగించారు. యమునానది వారికి కనిపించింది. ఉద్ధవుడు ఆ యమునా నది ఇసుక తిన్నెల మీద కూర్చుని శ్రీకృష్ణుడి పాదాలను ధ్యానిస్తూ ఆ రోజంతా గడిపాడు. మరుసటి రోజు బదరికాశ్రమానికి వెళ్ళిపోయాడు. శుకమహర్షి మాటలకు పరీక్షిత్తు అడ్డు తగిలాడు. కృష్ణుడి సంకల్పం మేరకు యాదవులంతా హతమైనప్పుడు ఉద్ధవుడు ఎలా బతికి బట్టకట్టాడని ప్రశ్నించాడు. లోకంలో జ్ఞానాన్ని వ్యాప్తి చేసేందుకు తనతో సమానుడైన ఉద్ధవుణ్ణి శ్రీకృష్ణుడీ భూమ్మీద నిలిపి వెళ్ళాడని శుకమహర్షి సమాధానం చెప్పాడు. శుకమహర్షి మళ్ళీ చెప్పడం మొదలెట్టాడు.

ఉద్ధవుడు వెళ్ళిన తర్వాత మైత్రేయుణ్ణి దర్శించాలనే కుతూహలంతో విదురుడు అక్కణ్ణుంచి బయలుదేరాడు. యమునానదిని దాటి కొన్ని రోజులు ప్రయాణం సాగించాడు. దారిలో అనేక నదులనూ, విష్ణుక్షేత్రాలనూ దాటి ముందుకు వెళ్ళాడు. గంగానదిలో స్నానం చేశాడు. అక్కడే ఒక ఇసుక తిన్నెమీద పద్మాసనంలో కూర్చుని ఉన్న మైత్రేయుణ్ణి దర్శించాడు.

శ్రీకృష్ణుడెంత గొప్పవాడో అతని ఉదంతాన్ని బట్టి అవగతమౌతుంది. పరోపకారం కోసం, లోకోపకారం కోసం అతడు ఎలాంటి కష్టాలను ఆహ్వానించాడో అర్థమౌతుంది. ఆదర్శవంతమైన ఆయన వ్యక్తిత్వం ఆవిష్కృతమౌతుంది. ధర్మరక్షణకోసం, ప్రకృతి శాసన పరిరక్షణ కోసం తనవాళ్ళందరినీ సైతం మరణం పాలు చేసిన కృష్ణుడి మనోదార్ఢ్యమిక్కడ ప్రస్ఫుటమౌతుంది. ఆత్మీయులపట్ల ఆయనకు గల అనుగ్రహం అభివ్యక్తమౌతుంది. (సశేషం)

హరి పాఠము

తెలుగు : మిట్టపల్లి శంకరయ్య - శ్రీ జ్ఞానేశ్వర్ మహరాజు

అభంగ్ -13

సమాధీ హరీచీ సమసుఖే వీణ్ !
న సాధేల్ జాణ్ ద్వైత బుద్ధీ !!
బుద్ధీ చే వైభవ్ అన్య్ నాహీ దుజే !
ఏకా కేశవ రాజే సకళ సిద్ధీ !!
రిద్ధి సిద్ధి నిధీ అవఘీచ్ ఉపాధీ !
జవ్ త్యా పరమానందీ మన్ నాహీ !!
జ్ఞానదేవీ రమ్య్ రమలే సమాధాన్ !
హరీ చే చింతన్ సర్వకాళ్ !!

భావము : సమసుఖము కలుగక పూర్వము శ్రీహరిలో సమాధి సుఖాన్ని పొందజాలము. ద్వైత బుద్ధి ఉన్నంత కాలము సమసుఖము సాధ్యము కాదు. బుద్ధి యొక్క వైభవము అన్యముగా రెండవది ఏదీ లేదు. ఒక్క కేశవరాజే సకల సిద్ధులకు మూలకారణము. పరమానందునిలో మనసు స్థిరముగ లేనిచో ఈ రిద్ధి సిద్ధీ, నిధులు సర్వము అవసరము లేని ఉపాధులే అయిపోతాయి.

హరి చింతనలో సర్వకాలము నా మనసు రమించి లీనమైపోవుట వలన నాకు సమాధానము లభించినదని జ్ఞానదేవులు తెలిపినారు.

వార్తలు

(01). 28-03-2021వ తేది పూర్ణిమ నాడు శ్రీ శుకబ్రహ్మాశ్రమములో గురుపాదుకలకు అర్చన చేయబడినది. ధన్వంతరి హోమం చేయబడి అన్న సంతర్పణ జరిగినది.

(02). 04-04-2021వ తేది ఆదివారం సద్గురు సర్వసేవా ట్రస్టు బోర్డు సమావేశం జరిగినది.

(03). 10-04-2021వ తేది మాస శివరాత్రి సందర్భంగా ఆశ్రమ శివాలయంలో నర్మదేశ్వర మహాదేవునకు ప్రదోషకాలంలో రుద్రాభిషేకం, బిల్వార్చన జరిగినది.

(04). 13-04-2021వ తేది ప్లవనామ సంవత్సరం ఉగాది నాడు ఉదయం ఆశ్రమ శివాలయంలో శివునకు రుద్రాభిషేకం, బిల్వార్చన జరిగినది. ఆశ్రమ వాసులందరిచే విష్ణు సహస్రనామాదుల పారాయణ చేయబడినది. ఉగాది పచ్చడి ప్రసాదం వితరణ చేయబడినది. వేదపారాయణానంతరం వేదపణ్డితులకు సన్మానం చేయబడినది. పంచాఙ్గ శ్రవణం జరిగినది.

(05). 15-04-2021వ తేది కృత్తిక సందర్భంగా ఆశ్రమ శివాలయంలోని శ్రీ సుబ్రహ్మణ్యస్వామికి ప్రదోష కాలంలో అభిషేకం, అర్చన చేయబడి ప్రసాద వితరణ చేయబడినది.

(06). 21-04-2021వ తేది బుధవారం నాడు శ్రీరామ నవమి సందర్భంగా ఆశ్రమంలో శ్రీరామచంద్రునకు షోడశోపచార పూజ చేయబడినది.

(07). ఆశ్రమ భక్త కన్నప్ప కంటి ఆసుపత్రిలో **2021 మార్చి నెలలో** ఓ.పి.లో **1079 మందికి** కంటి పరీక్షలు చేసి తగు చికిత్సలు చేయబడినవి. సర్జరీ విభాగంలో **61 మందికి** కంటి పొరలు తీసి కళ్ళలో లెన్సు అమర్చబడినవి.

పూజ్యశ్రీ విద్యాప్రకాశానందగిరిస్వాములవారి రచనలు చదవండి, చదివించండి.

		రూ.
1.	గీతామకరందము (తెలుగు)	350.00
2.	గీతామకరందము (ఇంగ్లీషు)	400.00
3.	యోగవాసిష్ఠ రత్నాకరము	300.00
4.	రామాయణ రత్నాకరము	300.00
5.	భాగవతరత్నాకరము	300.00
6.	భారతరత్నాకరము	300.00
7.	ఉపనిషద్రత్నాకరము	150.00
8.	మోక్షసాధనరహస్యము	100.00
9.	The Secret of Liberation	200.00
10.	Lecturers on Geetha	200.00
11.	గీతోపన్యాసములు	120.00
12.	బ్రహ్మచర్యవిజయము	60.00
13.	బ్రహ్మానంద వైభవము	30.00
14.	ఆత్మానుసంధానము	50.00
15.	అమృతబిందువులు	50.00
16.	స్థూలాక్షరి తాత్పర్యగీత	70.00
17.	పరమార్థ కథలు	120.00
18.	స్వాములవారి జీవిత చరిత్ర	100.00
19.	ఉపనిషత్ కథలు	40.00

గ్రంథములు కావలసినవారు పైకనిన ప్రకారము వీటి ధరలను ఎం.ఓ. ద్వారాగానీ, చెక్కు ద్వారా గాని, శ్రీ శుకబ్రహ్మాశ్రమము. శ్రీశుకబ్రహ్మాశ్రమము పోస్టు, శ్రీకాళహస్తి - 517 640 అను చిరునామాకు పంపగలరు. పోస్టేజి అదనము.

Regd. No. TRP / 123 / 2021-23 May 2021 Rs. 10/- R.No.8139/63
Date of Publication 26-04-2021, Permitted to Post : 29th, 30th every month.



ఈ పేజీ స్థల దాతలు

సుభద్రా చారిటబుల్ ట్రస్టు

హైదరాబాద్, తెలంగాణ రాష్ట్రం